

తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365



TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA



**విలేకరులు కావలెను**

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365



| యాదాద్రిభువనగిరి | సంపుటి: 01 | సంచిక.42 | సోమవారం | 7.సెప్టెంబర్.2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వేల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue.42 | Monday | 7.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |




## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన
# అట్టర్ ఫ్లాప్

- పార్టీ ఎవరికి బీఫాం ఇచ్చినా గెలిచే పరిస్థితి: బీఆర్ఎస్ఎల్పీ భేటీలో కేసీఆర్
- సాగునీటి కోసం లక్షలాది మందితో త్వరలో ప్రత్యక్ష కార్యాచరణ
- హామీల అమలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగం,
- తాగునీరు, ఉద్యోగుల సమస్యలపైనా పోరాటం అసెంబ్లీ, మండలిలో ప్రజల గొంతు వినిపించాలి..
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డిపై ప్రభుత్వాన్ని నిలదీయాలి

హైదరాబాద్: రాష్ట్రంలో రాజకీయంగా మళ్లీ బీఆర్ఎస్ సునామీ రాబోతోందని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. 'కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్ అయింది. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎవరికి బీఫాం ఇచ్చినా గెలిచే పరిస్థితి ఉంది. అలా అని పార్టీ నేతలు, కార్యకర్తలు రిలాక్స్ కావొద్దు. ప్రజల్లో ఉంటూ నిరంతరం పోరాడాలి..' అని చెప్పారు. సోమవారం నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ఎర్రవెల్లిలో బీఆర్ఎస్ఎల్పీ సంయుక్త సమావేశాన్ని కేసీఆర్ నిర్వహించారు. దాదాపు 3 గంటల పాటు సాగిన ఈ భేటీలో.. అసెంబ్లీ, మండలిలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంతో పాటు రాష్ట్రంలోని ప్రధాన ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. 'కాంగ్రెస్‌ది థర్డ్‌క్లాస్ పాలన. తెలంగాణ రైజింగ్ కాదు.. డౌన్‌ఫాల్ వైపు వెళ్లింది. కాంగ్రెస్‌కు నూకలు చెల్లాయని అర్థమైంది. అందుకే ఆ పార్టీ నేతలు దోపిడీకి పాల్పడుతున్నారు. తెలంగాణ రైజింగ్ కాదు.. డౌన్‌ఫాల్ వైపు వెళ్లింది. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీని అధికార పక్షం బూతు కూతలకు

- మిగతా 2వ పేజీలో

# అసెంబ్లీలో కాంగ్రెస్‌కు చుక్కలు చూపిస్తాం

- అసెంబ్లీ నెల రోజులు జరపాలి
- కాంగ్రెస్ వైఫల్యాలపై నిలదీస్తాం
- కేసీఆర్‌కు గౌరవం లేదంటూ ఫైర్
- స్పీకర్‌పై అవిశ్వాసానికీ వెనకాడం

2లో





## ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం..
# ముగ్గురి మృతి

- ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఘోర ప్రమాదం
- ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, పలువురిని కాపాడిన సహాయక బృందాలు
- మరమ్మతు పనులు చేస్తుండగా పాత భవనం కూలిపోయినట్లు వెల్లడి
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై విపక్షాలు ఆగ్రహం, ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్
- శిథిలాల కింద పలువురు విద్యార్థులు చిక్కుకున్నట్లు అనుమానాలు

దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో మరమ్మతు పనులు జరుపుకుంటున్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

- మిగతా 2వ పేజీలో

## 2040 వరకు తెలంగాణలో
# కాంగ్రెస్‌దే అధికారం

- ఇందిరాపార్కు వద్ద మహాధర్నాలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- బాధ్యత గల ప్రతిపక్ష నేత పదవిని అపహాస్యం చేయొద్దు
- జీతం తీసుకుంటూ ఫామ్‌హౌస్‌కు పరిమితం కావొద్దు
- అధికారం శాశ్వతం కాదు.. అది ప్రజలిచ్చే కానుక



హైదరాబాద్: ప్రభుత్వ జీతం తీసుకుంటూ ఫామ్‌హౌస్‌కు పరిమితమైన బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు వెంటనే తన ప్రధాన ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. అధికారం, ప్రభుత్వాలు, పదవులు శాశ్వతం కాదని, ప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్ష నేతకు చాలా గౌరవం ఉంటుందని, అలాంటి పదవిని అపహాస్యం చేయవద్దని హితవు పలికారు. అసెంబ్లీకి రాని కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం టీపీసీసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు.

- మిగతా 2వ పేజీలో



2లో

## హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

- ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లపై స్పెషల్ డ్రైవ్‌కు డీజీపీ ఆదేశం
- గతంలోనూ ఇలాంటి దందాలను అరికట్టామని వెల్లడి
- చింతల్‌లో గృహప్రవేశం వద్ద రూ. 50 వేలు డిమాండ్ చేసిన ఘటన వైరల్
- ప్రభుత్వ ప్రోత్సాహంతో పలువురు ట్రాన్స్‌జెండర్లు మంచి పేరు తెచ్చుకున్నారని ప్రశంస
- అన్ని కమిషనరేట్ల పరిధిలో తనిఖీలు చేపట్టాలని పోలీసులకు సూచన



2

## ఛిద్రమైన కలలను నిలబెట్టగలరా?

**బిహార్‌లో విద్యార్థులపై కాల్పులు అమానుషం: రాహుల్**

న్యూఢిల్లీ: బిహార్‌లో విద్యా రంగంలో సమస్యల పరిష్కారం కోసం నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం, తుపాకులతో కాల్పులు జరపడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

## టీడీపీ నేత వసంత్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి నారా లోకేశ్

- ఇటీవల టీడీపీ నేత చెరుకూరి వసంత్ కుమార్ మృతి
- చిత్తూరు జిల్లా పెద్దకాల్వ గ్రామంలో లోకేశ్ పర్యటన
- వసంత్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు
- పార్టీకి ఆయన సేవలను గుర్తు చేసుకున్న లోకేశ్
- కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ



రాష్ట్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ చిత్తూరు జిల్లాలో పర్యటించారు. ఇటీవల కన్నుమూసిన టీడీపీ సీనియర్ నేత చెరుకూరి వసంత్ కుమార్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. గంగాధర నెల్లూరు మండలం

మిగతా 2 లో

## సీఎం ఇంటి వద్ద ఉద్యోగ సంఘాల నేతల మధ్య ఘర్షణ

- ఏపీ జేఏసీ, ప్రభుత్వ ఉద్యోగ సంఘం మధ్య తోపులాట
- ఒకరి ప్రెస్ మీట్‌ను మరొకరు అడ్డుకోవడంతో వివాదం
- ఇరు వర్గాల పోటాపోటీ నినాదాలతో ఉద్రిక్తత
- సీనియర్ నేతల జోక్యంతో సద్దుమణిగిన గొడవ

అమరావతిలో ఉద్యోగ సంఘాల నేతల మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశం ముగిసిన అనంతరం, ఉండవల్లిలోని సీఎం నివాసం వెలుపల ఇరు సంఘాల నేతలు బాహాబాహీకి దిగారు. ఏపీ జేఏసీ, ఏపీ

మిగతా 2 లో



## హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 4న చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు. ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

## సీఎం ఇంటి వద్ద ఉద్యోగ సంఘాల నేతల మధ్య ఘర్షణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకుల మధ్య చోటుచేసుకున్న తీవ్ర వాగ్వివాదం, తోపులాటతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీఎంతో భేటీ అనంతరం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ మీడియాతో మాట్లాడుతుండగా.. అదే సమయంలో ఏపీ జేఏసీ నాయకులు అక్కడికి చేరుకుని పోటాపోటీగా నినాదాలు చేశారు. సూర్యనారాయణ ప్రసంగాన్ని అడ్డుకోవడంతో వివాదం మొదలైంది. ఇది కాస్తా ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి పరస్పరం తోపులాటకు దారితీసింది. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సూర్యనారాయణ, "నువ్వు అరిచినంతసేపు ఇక్కడి నుంచి కదలను. ఏం చేసుకుంటావో చేసుకో. దశాబ్దాలుగా నేను ఉద్యోగ సంఘాల్లో ఉన్నాను" అంటూ జేఏసీ నేతలపై మండిపడ్డారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారుతుండటంతో ఏపీ జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్‌తో పాటు ఇతర సీనియర్ నాయకులు జోక్యం చేసుకున్నారు. ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

## టీడీపీ నేత వసంత్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి నారా లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)

పెద్దకాల్వ గ్రామంలోని వసంత్ కుమార్ నివాసానికి వెళ్లిన లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వసంత్ కుమార్ చిత్రపటానికి లోకేశ్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీకి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన లోకేశ్, వారికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను నారా లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు.

## ఛిద్రమైన కలలను నిలబెట్టగలరా?

(మొదటి పేజీ తరువాయి)

విరిగిన ఎముకలను సరిచేయవచ్చు గానీ చెదిరిపోయిన విద్యార్థుల కలలను పునరుద్ధరించగలరా? అని ప్రధాని మోదీ, బిహార్ సీఎం సామ్రాట్‌లను ప్రశ్నించారు. బిహార్ విద్యార్థులు, యువతతో తాను ఇటీవల సమావేశమైన వీడియోను రాహుల్ గాంధీ ఆదివారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. పరీక్షల విధానంలో అక్రమాలకు వ్యతిరేకంగా విద్యార్థులు గళమెత్తినందుకు పోలీసులు లాఠీలతో చావబాదారని, కాల్పులు జరిపారని మండిపడ్డారు. పిల్లలు చేసిన పాపం ఏమిటి కాల్పులు జరిపేటంత నేరం వారు ఏం చేశారు? అని నిలదీశారు. బిహార్‌లో ఏకే--47 బుల్లెట్ తాకడంతో ఒక విద్యార్థి కాలి ఎముక విరిగిపోయిందని, దాంతో సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలన్న అతని కల కరిగిపోయిందని రాహుల్‌అన్నారు. మరో ఇద్దరు విద్యార్థుల భుజాల గుండా బుల్లెట్లు దూసుకెళ్లాయని తెలిపారు. విద్యార్థులు నేరస్తులు కాదని తేలి?చచెప్పారు. కుటుంబాల ఆశయాలను మోస్తూ చదువుకోవడానికి బయటకు వచి?చన పేద పిల్లలపై కాఠిన్యం ప్రదర్శించడం ఏమిటని ప్రశ్నించారు. తూటా గాయాలు మానుతాయి గానీ పిల్లల మనసుల్లో లోతుగా పాతుకుపోయిన భయానికి చికిత్స చేసే ఆసుపత్రి ఎక్కడ ఉంది? అని ప్రశ్నించారు. విద్యార్థుల ఛిద్రమైన కలలను మళ్లీ నిలబెట్టగలరా? అని నిలదీశారు.



## ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.. ముగ్గురి మృతి

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 40-50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి" అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. "ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అతిషి కూడా ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని ఆమె పేర్కొన్నారు. సమీపంలోనే ప్రచారం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్, తాము ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురిని కాపాడామని తెలిపారు. ప్రమాద స్థలంలో విద్యార్థులకు చెందిన పుస్తకాలు కనిపించాయని, ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణమని ఆరోపించారు. ప్రమాదం జరిగిన భవనం పక్కనే ఉన్న పీజీలో నివసించే ఓ విద్యార్థి మాట్లాడుతూ, "భోజనం చేశాక ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లు భవనం కంపించింది. బాల్కనీలోకి వచ్చి చూస్తే అంతా దుమ్ముతో నిండిపోయింది. కిందకు దిగాక భవనం కూలిందని అర్థమైంది. అధికారుల కంటే ముందే మేం ఒకరిని శిథిలాల నుంచి బయటకు లాగాం" అని తెలిపారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, ఇంకా 20-30 మంది శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.



## అసెంబ్లీలో కాంగ్రెస్‌కు చుక్కలు చూపిస్తాం

(మొదటి పేజీ తరువాయి)



ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగిన శాసనసభా పక్ష సమావేశంలో అసెంబ్లీ సమావేశాల వ్యూహంపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా ఎండగడతామని స్పష్టం చేశారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని ఆరోపించిన ఆయన.. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాలను కనీసం నెల రోజుల పాటు నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (దీూజ)లో డిమాండ్ చేస్తామని హరీశ్ రావు తెలిపారు. సభలో తమకు మాట్లాడేందుకు తగిన సమయం, అవకాశం కల్పించాలని స్పీకర్‌ను కోరుతామని చెప్పారు. ప్రతిపక్షానికి సముచిత ప్రాధాన్యం ఇవ్వకుండా వ్యవహరిస్తే ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. 22ఏ అంశంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు తీరుపై సభలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్ రావు అన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన ప్రభుత్వమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ నేతలకు లేదని వ్యాఖ్యానించారు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్‌కు అసెంబ్లీలో తగిన గౌరవం ఇవ్వడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. ముఖ్యమంత్రి స్థాయిలో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్న పరిస్థితుల్లో కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా అభిప్రాయపడ్డామని తెలిపారు. గతంలో జయలలిత, ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు వంటి నేతలు కూడా గౌరవం లభించని సందర్భాల్లో అసెంబ్లీకి దూరంగా ఉన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఇదే సమయంలో సీఎం కుటుంబ సభ్యులకు భద్రత కల్పించే విషయంలోనూ హరీశ్ రావు ప్రశ్నలు సంధించారు.



## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్ ఫ్లాప్..

(మొదటి పేజీ తరువాయి)

వేదికగా మార్చింది. పాలన చేతకాక చిల్లర మాటలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్షంగా ప్రజల గొంతును ఉభయ సభల్లో బలంగా వినిపించే బాధ్యత బీఆర్ఎస్‌పైనే ఉంది. ప్రజల జెండానే బీఆర్ఎస్ ఎజెండాగా ఉండాలి., ప్రతి చర్చలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పనిసరిగా పాల్గొనాలి. శాసనమండలి కూడా పాత భవనంలోకి వచ్చిన నేపథ్యంలో రెండు సభల్లో పార్టీ సభ్యులు మరింత సమన్వయంతో వ్యవహరించాలి..' అని కేసీఆర్ సూచించినట్లు తెలిసింది.

### ఎన్డీఎస్ఏ చెప్పినా కాళేశ్వరంపై నిర్లక్ష్యం

కాళేశ్వరం ప్రాజెక్టులను వినియోగించుకోవచ్చని కోవచ్చని ఎన్డీఎస్ఏ స్పష్టం చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. మేడిగడ్డ వద్ద అవసరమైన చిన్నపాటి మరమ్మతులు చేపట్టి ప్రాజెక్టులను వినియోగంలోకి తెస్తే దాదాపు 13 జిల్లాల రైతాంగానికి ప్రయోజనం కలుగుతుంది. అయినా నీటిని ఎత్తిపోసేందుకు ప్రభుత్వం ఎందుకు ప్రయత్నించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలి. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నీళ్లున్నా తెలంగాణ పంటలకు విడుదల చేయడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు 90 శాతం పూర్తి చేసిన పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదు? కాళేశ్వరం, పాలమూరు--రంగారెడ్డి అంశాలపై అవసరమైతే ఉభయ సభలను స్తంభింపజేయాలి. వీటి విషయంలో ఇదే నిర్లక్ష్యం కొనసాగితే సాగునీటి కోసం లక్షలాది మంది రైతులు, కార్యకర్తలతో కలిసి నేనే స్వయంగా ప్రత్యక్ష కార్యాచరణ చేపడతా. సాగునీటి కోసం త్వరలో మరో యుద్ధానికి సిద్ధమవుదాం..' అని కేసీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## 2040 వరకు తెలంగాణలో కాంగ్రెస్‌దే అధికారం

(మొదటి పేజీ తరువాయి)

బీసీ సంక్షేమ శాఖ సలహాదారు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్‌లతో పాటు ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్ కుమార్‌యాదవ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు జగ్గారెడ్డి అంజన్‌కుమార్ యాదవ్, పలువురు డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



### మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం..

ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం కేసీఆర్‌కు కనపడడం లేదా అని ప్రశ్నించారు. 'మేం తప్పు చేస్తే ప్రతిపక్షాలు ఎత్తి చూపొచ్చు. కానీ అసత్యాలు ప్రచారం చేయడం సబబు కాదు. తప్పిదాలు జరిగితే సరిదిద్దుకుంటాం..' అని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం అమలు జరుగుతున్నాయని, మళ్లీ కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారం ప్రజలు ఇచ్చే కానుక అని, దాన్ని మేం సది?వనియోగం చేసుకుంటుంటే, ప్రజలిచ్చిన అవకాశాన్ని ప్రతిపక్ష పార్టీలు దుర్వినియోగం చేసుకుంటున్నాయన్నారు. మంత్రి అజహరుద్దీన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణ ప్రజల సొమ్ము తింటూ ఫామ్‌హౌస్‌లో పడుకుంటున్నాడని విమర్శించారు. అసెంబ్లీకి వస్తావా, రాజీనామా చేస్తావా అని ప్రశ్నించారు. ఒకవేళ కేసీఆర్ రాజీనామా చేయకపోతే స్పీకర్ తగిన చర్యలు తీసుకుని ఆయన శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తొలివెలుగు
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
యాదాద్రి భువనగిరి సోమవారం 7 సెప్టెంబర్ 2026


## బీసీలకు అన్యాయం చేస్తే సహించేది లేదు

- మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపు దురదృష్టకరం
- బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తున్న రేవంత్ సర్కార్: తొర్ర విష్ణు



తొలివెలుగు, ఆత్మకూరు (ఎం) : పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన మంత్రి కొండా సురేఖను పదవి నుంచి బర్తరఫ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, బీసీలకు అన్యాయం చేస్తే సహించేది లేదని పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త తొర్ర విష్ణు పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందని, వారి సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కొండా సురేఖను ఏ కారణంతో పదవి నుంచి తొలగించారో ప్రభుత్వం ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణ నాయకులు ప్రెస్ మీట్లు పెట్టి మాట్లాడితే లేని తప్పు, బీసీ ఆడబిడ్డ మాట్లాడితే కక్షసాధింపు చర్యలకు దిగడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీ నాయకులు ఇప్పటికైనా అగ్రవర్ణ నాయకుల మాయమాటలు నమ్మకుండా స్వయంప్రతిపత్తితో ఎదగాలని పిలుపునిచ్చారు. రేవంత్ ప్రభుత్వం బీసీలపై నిర్లక్ష్య వైఖరిని వీడకపోతే రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## ఆధ్యాత్మిక శోభతో మురిసిన రాజాపేట

- వైభవంగా సామూహిక బోనాల ఉత్సవాలు
- గ్రామ దేవతలకు నైవేద్యాల సమర్పణ

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండల కేంద్రంలో ఆదివారం సామూహిక



బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు ప్రత్యేకంగా బోనాల పండుగను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పెరిక, పద్మశాలి, రజక సామాజిక వర్గాలకు చెందిన మహిళలు బోనం కుండలతో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తరలివెళ్లారు. గ్రామ దేవతలకు, బొడ్రాయి, గడికోటలోని పోచమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవార్లను వేడుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన రాజాపేట వాసులు స్వగ్రామానికి చేరుకుని ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలికి రోటరీ క్లబ్ సన్మానం

- 28 ఏళ్ల విద్యాసేవలకు గుర్తింపు
- గణిత ఉపాధ్యాయురాలు అనురాధకు అభినందనలు

తొలివెలుగు, రాజాపేట : స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా సేవలు అందిస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు పడమటి




అనురాధను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తిలో 28 ఏళ్లుగా విశేష సేవలు అందిస్తున్న ఆమెను క్లబ్ ప్రతినిధులు శాలువా, పూలమాలలతో అభినందించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెంచుతూ, పాఠశాల పురోగతికి అనురాధ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.

## ఖానాపూర్‌లో చర్చి స్థలంలో చొరబాటు.. సీసీ కెమెరాలు, కార్యాలయ తలుపులు ధ్వంసం

గండిపేట్:నార్సింగి సర్కిల్ గండిపేట మండలం ఖానాపూర్ గ్రామంలోని బాప్టిస్ట్ చర్చి స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి ఆస్తులను ధ్వంసం చేశారంటూ చర్చి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చర్చి కమిటీ ఫిర్యాదు ప్రకారం.. సెప్టెంబర్ 5న మధ్యాహ్నం రామేశ్వరం నర్సింహతో పాటు మరికొందరు చర్చి ప్రాంగణంలోకి అనుమతి లేకుండా ప్రవేశించి సొసైటీ ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న చర్చి ప్రతినిధులు అక్కడికి చేరుకుని వాటిని తొలగించినట్లు తెలిపారు. అదే రోజు రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో రామేశ్వరం నర్సింహతో పాటు మొత్తం 22 మంది మళ్లీ చర్చి ప్రాంగణంలోకి వచ్చి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని, ఎగ్జిక్యూటివ్ కమిటీ కార్యాలయ తలుపులు పగులగొట్టి లోపల ఉన్న ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# పులిగిల్లలో ఘనంగా గ్రామదేవతలకు బోనాలు



- భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించిన గ్రామస్థులు
- డప్పువాయిద్యాల మధ్య సాగిన బోనాల ఊరేగింపు
- ముత్యాలమ్మ, బంగారు మైసమ్మకు ప్రత్యేక పూజలు
- వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకోలు

తొలివెలుగు, వలిగొండ: వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో గ్రామదేవతల బోనాల పండుగను ఆదివారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాలను ప్రత్యేకంగా అలంకరించి డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామదేవతలకు సమర్పించారు. మహిళలు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. అమ్మవార్లకు బోనాలు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామదేవతలను వేడుకున్నారు. గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలనే ఆకాంక్షతో ప్రతి ఏడాది బోనాల పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

**రజక సంఘం ఆధ్వర్యంలో ముత్యాలమ్మ, బంగారు మైసమ్మకు బోనాలు:**

గ్రామంలోని రజక సంఘం ఆధ్వర్యంలో ముత్యాలమ్మ, బంగారు మైసమ్మ తల్లి దేవతలకు ప్రత్యేకంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా రజక మహిళలు బోనం కుండలను కుంకుమ, పసుపు, వేపకొమ్మలతో అందంగా అలంకరించారు. అనంతరం బోనాలను నెత్తిన ఎత్తుకుని డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయాల వద్దకు చేరుకున్నారు. శివసత్తుల పూనకాలతో భక్తులు ఉత్సాహంగా పాల్గొనగా, అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులు భక్తులతో సందడిగా మారాయి. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పండుగకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. వివిధ కుల సంఘాలు సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహించగా, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేముల అనూష మల్లేష్, ఉప సర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్, వార్డు సభ్యులు, వివిధ కుల సంఘాల పెద్దలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామ-స్థులు తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో బసంతపురంలో బోనాల ఉత్సవం

- పోచమ్మ, గణిమైసమ్మ, దుర్గమ్మ తల్లులకు ఘనంగా బోనాలు
- గ్రామ సుభిక్షం, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని అమ్మవార్లకు మొక్కులు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతుల ప్రత్యేక ప్రార్థనలు
- సర్పంచ్ మెండు రత్నమాల సతిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు



తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలం బసంతపురం గ్రామంలో ఆదివారం బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ మెండు రత్నమాల సతిరెడ్డి ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి, గణిమైసమ్మ తల్లి, దుర్గమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, రైతులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. గ్రామ ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొనడంతో బసంతపురంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుల్లపల్లి రాజుగౌడ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు మెండు మధుసూదన్‌రెడ్డి, గుల్లపల్లి స్వామిగౌడ్, గుల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, వడ్లకొండ నర్సయ్య తదితరులు పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేశారు.



## రైతన్నకు సాగునీటి పండుగ.. 15వ ప్యాకేజీకి గ్రీన్ సిగ్నల్

- రూ.47 కోట్లతో కాల్వ పనులు.. త్వరలోనే శ్రీకారం
- గంధమల్ల ప్రాజెక్టు భూమిపూజలో పనులపై విప్ బీర్ల అయిలయ్య ప్రకటన
- కాల్వ పనులతో సాగునీటి లభ్యత మెరుగుపడే అవకాశం
- హర్షం వ్యక్తం చేసిన పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌గౌడ్, కాంగ్రెస్ శ్రేణులు

తొలివెలుగు, రాజాపేట: రూ.47 కోట్ల అంచనా వ్యయంతో 15వ ప్యాకేజీ కాల్వ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం గంధమల్ల ప్రాజెక్టు పనుల భూమిపూజ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొని 15వ ప్యాకేజీ పనులను కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రకటించారని ఆయన పేర్కొన్నారు. 15వ ప్యాకేజీ కాల్వ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల రైతులకు సాగునీటి లభ్యత మరింత మెరుగుపడుతుందని మహేందర్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కాల్వ నిర్మాణంతో సాగునీటి సౌకర్యం విస్తరించి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. 15వ ప్యాకేజీ పనులను ప్రారంభించనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు రాజాపేట మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పనులు త్వరగా ప్రారంభమై రైతులకు సాగునీటి ప్రయోజనం అందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు ఐరేని నవీన్‌కుమార్, ఉప సర్పంచ్ నమిల కేదారిగౌడ్, డాక్టర్ చింతల రవి, గొల్లెన స్వామి తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాలలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి

- వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టిన లారీ
- ఘటనలో అక్కడికక్కడే మృతి చెందిన బండారు జనార్ధన్
- జాతీయ రహదారి పనుల జాప్యమే ప్రమాదాలకు కారణమంటూ టీఆర్ఎస్ నాయకుడి ఆరోపణ



తొలివెలుగు, చిట్యాల: చిట్యాల పట్టణంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చిట్యాలకు చెందిన బండారు జనార్ధన్ (65) బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లారీ ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన జనార్ధన్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు, స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ నాయకుడు బొబ్బల శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై రోడ్డు నిర్మాణ పనులు ఆలస్యం కావడం, రహదారిపై ఏర్పడుతున్న ఇబ్బందుల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడకుండా జాతీయ రహదారి పనులను వేగవంతం చేసి, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో చిట్యాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# ఉద్యమ నేత జిట్టాకు ఘన నివాళి

- అంగరంగ వైభవంగా రెండో వర్ధంతి వేడుకలు
- పోచంపల్లిలో రోగులకు పండ్ల పంపిణీ.. త్యాగాలను స్మరించుకున్న నేతలు



తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, 'సుజలధాత' స్వర్గీయ జిట్టా బాలకృష్ణారెడ్డి రెండో వర్ధంతి వేడుకలను పురపాలక కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిట్టా యువసేన, తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ?యువసేన మండల నాయకుడు కొమ్ము భానుచందర్ ఆధ్వర్యంలో స్థానిక నేతాజీ చౌరస్తాలో జిట్టా బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నివాళి కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జిట్టా బాలకృష్ణారెడ్డి తన ఆస్త్యాపాస్తులతో పాటు జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. నియోజకవర్గ సంక్షేమం కోసం ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో యువసేన, ఉద్యమకారుల సంఘం నాయకులు కొమ్ము భానుచందర్, రామిడి యాదిరెడ్డి, ముద్దం సత్యం యాదవ్, పోనమని శ్రీశైలం, చిలివేరు బాల నరసింహ, చింతకింది కిరణ్, బైరు రామాంజనేయులు, వంగూరి స్వామి, మెరుగు శశికళ, తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల పాలన.. ప్రజలకు నరకప్రాయం

- ఆరు గ్యారెంటీలను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- కరువు దూసుకొస్తున్నా పాలకుల్లో చలనం లేదు: జడల ఆదిమల్లయ్య



తొలివెలుగు, చిట్యాల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన ప్రజలకు నరకప్రాయంగా మారిందని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యాలను నిరసిస్తూ ఆదివారం చిట్యాలలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైందన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను అరకొరగా అమలు చేస్తూ రైతులను వంచిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు ముప్పు పొంచి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో మౌలిక సమస్యలు పేరుకుపోతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చేపూరి రవీందర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, నాయకులు బొబ్బల శివశంకర్ రెడ్డి, కల్లూరి మల్లారెడ్డి, కౌన్సిలర్లు షేక్ షబానా అజీమ్, నిమ్మనగోటి శ్రీనివాస్, మండే సైదులు, జిట్టా బొందయ్య, జమాండ్ల శ్రీనివాస్ రెడ్డి, ఆగు అశోక్, రుద్రారపు బిక్షపతి, బొల్లూరి సైదులు, మద్ది మధు, ఆవుల ఆనంద్, జుట్టా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్ హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

గండిపేట్,తొలివెలుగు: మైలార్ దేవ్ పల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని పల్లె చెరువు సమీపంలో జరిగిన మహమ్మద్ ఖాజీ సోహైల్ అనే రౌడీషీటర్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. పాత కక్షలు, గంజాయి విక్రయాల వివాదాల వల్ల ఈ హత్య జరిగింది. సెప్టెంబర్ ఒకటిన రాత్రి నిందితులు, బాధితుడు కలసి మద్యం సేవించారు. అనంతరం సెప్టెంబర్ రెండున తెల్లవారుజామున రెండు గంటలకు మహమ్మద్ అబ్దుల్ రహీమ్, మహమ్మద్ ఇషాక్ లు సోహైల్ ను ద్విచక్ర వాహనంపై అబ్దుల్ కరీమ్ ట్రేడర్స్ దగ్గరకు తీసుకెళ్లి కత్తులతో పొడిచి చంపారు. ప్రధాన సూత్రధారి సయ్యద్ అర్షద్ చెప్పినట్లుగా నిందితులు వినాయక్ నగర్ కళ్ల కాంపౌండ్ పక్కన ఉన్న చెత్తకుప్ప వద్ద బట్టలు, కత్తులను కాల్చివేశారు. విచారణలో రాజేంద్రనగర్ డిసిపి, చంద్రాయణగుట్ట ఎసిపి ఆదేశాలతో మైలార్ దేవ్ పల్లి పోలీసులు రంగంలోకి దిగారు. ఘటన స్థలం నుండి రెండు పిడి లేని కత్తులు, ఒక కత్తి, ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు అర్షద్ పై గతంలో పదమూడు కేసులు, రహీమ్ పై రెండు కేసులు ఉన్నట్లు తెలిసింది. సెప్టెంబర్ ఆరున మధ్యాహ్నం మూడు గంటలకు ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

# పేద రెడ్లకు అండగా నిలవాలి

- రెడ్డి కార్పొరేషన్, రిజర్వేషన్లు కల్పించాలని బద్దూరి వెంకటేశ్వరరెడ్డి డిమాండ్
- పోచంపల్లిలో కోలాహలంగా నూతన కార్యవర్గ ప్రమాణ-స్వీకారం




తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి : రాష్ట్రంలోని ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి కులస్థులను ఆదుకోవడానికి ప్రభుత్వం తక్షణమే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బద్దూరి వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రెడ్డి సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా కల్లెం ముత్యంరెడ్డి, ఉపాధ్యక్షులుగా కొమురెల్లి రామచంద్రారెడ్డి, కొమురెల్లి బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సామల రాజిరెడ్డి, సహాయ కార్యదర్శిగా మద్ది మధుసూదన్ రెడ్డి, కోశాధికారిగా బోయపల్లి శశిధర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో బద్దూరి మాట్లాడుతూ.. 'ఒకే సంఘం – ఒకే నినాదం'తో రెడ్డి కులస్థులంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. అనైక్యత వల్లే ప్రభుత్వాలు మన సమస్యలను విస్మరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదరికంలో ఉన్న రెడ్డి సామాజికవర్గానికి రిజర్వేషన్లు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల సంజీవరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటం మధుసూదన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నపల్లి లింగారెడ్డి, మరీ నరసింహారెడ్డి, కొట్టం కరుణాకర్ రెడ్డి, మద్ది అంజిరెడ్డి, కొమురెల్లి నరసింహారెడ్డి, ఏనుగు కిషన్ పాల్గొన్నారు.

# యువజన ప్రదర్శనను జయప్రదం చేయాలి




- ఏఐవైఎఫ్ ప్రచార జాతాను ప్రారంభించిన పూర్వ నాయకులు
- యాదగిరిగుట్టలో సెప్టెంబరు 8 నుంచి రాష్ట్ర మహాసభలు

తొలివెలుగు, వలిగొండ : సెప్టెంబరు 8న నిర్వహించే యువజన భారీ ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ పిలుపునిచ్చారు. ఆదివారం వలిగొండ మండలం దుప్పల్లి గ్రామంలో ఏఐవైఎఫ్ ప్రచార జాతాను పూర్వ నాయకుడు కామ్రేడ్ బాలగోని సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ?ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. దేశంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నెరవేర్చలేదని విమర్శించారు. యువతకు ఉపాధి హామీ కల్పించేందుకు 'భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్' (బీఎన్ఈజీఏ) చట్టాన్ని తీసుకురావాలన్నారు. సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ నాయకులు ఎలగందుల అంజయ్య, కట్ల యాదగిరి, నరిగె యాదయ్య, అంబటి అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మొగుళ్ల శేఖర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మారోజు నరసింహాచారి, కార్యదర్శి సుద్దాల సాయికుమార్, బాలగోని మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

# జిట్టా త్యాగం మరువలేనిది

- వలిగొండలో శోభాయమానంగా రెండో వర్ధంతి
- తెలంగాణ కోసం సర్వస్వం త్యాగం చేశారని స్మరించుకున్న నేతలు

తొలివెలుగు, వలిగొండ : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు స్వర్గీయ జిట్టా బాలకృష్ణారెడ్డి రెండో వర్ధంతి వేడుకలను ఆదివారం వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. భువనగిరి గడ్డ నుంచి పల్లె పల్లెకూ, అక్కడి నుంచి ఢిల్లీ వరకు తెలంగాణ ఉద్యమాన్ని తీసుకెళ్లడంలో జిట్టా బాలకృష్ణారెడ్డి కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తన ఆస్తులను సైతం కోల్పోయి, ఎన్నో ఒడుదొడుకులను తట్టుకుని నిలబడిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడవడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, బీసీ సంఘం మండలాధ్యక్షుడు సాయిని యాదగిరి, నాయకులు చిలుకూరు సత్తిరెడ్డి, బొల్లు శ్రీనివాస్, నానచర్ల రమేష్, మస్కు నరసింహ, ఎండి సమ్మద్, కంకల శ్రీను, లగోని వెంకటేశం, కూర వెంకన్న, కొండూరు సత్య సురేష్, పడమటి దామోదర్ రెడ్డి, రాపోలు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.





# చలో అమరావతిని జయప్రదం చేయాలి

- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆత్మకూరు (ఎం) మండల సమావేశం
- వివిధ విభాగాల నూతన కమిటీల ఎన్నిక

తొలివెలుగు, ఆత్మకూరు (ఎం): అసమానతలు లేని సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా అక్టోబర్ 7న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ఇన్ ఛార్జి బిర్రు మహేందర్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు నల్ల చంద్రస్వామి, కో ఇన్ ఛార్జి మందుల లింగస్వామిల ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు అమరావతిలో జరుగబోయే మహాసభకు శ్రేణులంతా భారీగా తరలిరావాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల మండల, పట్టణ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మామిడి అనిల్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గురుకు విజయ్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా జిట్టా యాదగిరి, మహిళా సమైక్య అధ్యక్షురాలిగా గురుకు సంతోష, విద్యార్థి విభాగం (ఎంఎస్ఎఫ్) అధ్యక్షుడిగా గాదె మోహన్, పట్టణ అధ్యక్షుడిగా ఇంజమూరి నరేష్ ఎంపికయ్యారు. సోషల్ మీడియా కన్వీనర్‌గా బద్దుల మనోజ్, ఉద్యోగ సమైక్య బాధ్యులుగా వేముల నర్సింహ్మా, మేడి రామ్ లక్ష్మణ్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గద్దం ముత్తమ్మ, కానుకుంట్ల యాదగిరి, సుంకిశాల ఎల్లయ్య, గట్టు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# జిఎంఎస్ ట్రస్టు సేవలు అభినందనీయం

- విద్యార్థులకు నగదు పురస్కారాలు.. రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మశ్రీ చింతకింది మల్లేశం

**తొలివెలుగు, రాజాపేట:** లక్ష్మీ కటాక్షం లేని సరస్వతీ పుత్రులకు జిఎంఎస్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ ప్రోత్సహించడం అభినందనీయమని ఆశు యంత్ర సృష్టికర్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత చింతకింది మల్లేశం అన్నారు. ఆదివారం నాగారం సత్యనారాయణ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జిఎంఎస్ ట్రస్ట్ నిర్వాహకులు ఎండి గౌస్ మియా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం, విద్యార్థులకు నగదు పురస్కార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మల్లేశం మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి నుంచి నిష్క్రమించిన తర్వాత కూడా పూర్వ విద్యార్థుల సహకారంతో గౌస్ మియా విద్యా సేవ కొనసాగించడం గొప్ప విషయమన్నారు. 'మా వంతుగా సమాజానికి' అనే నినాదంతో చేపడుతున్న ఈ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. అనంతరం రిటైర్డ్ ఎంఈఓ బల్ల దామోదర్, ప్రధానోపాధ్యాయులు బొందుగుల శేషారెడ్డి, శీలం వెంకటరెడ్డిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాజాపేట మండలానికి చెందిన పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజన్నగూడెంలో శ్రావణ బోనాల సందడి


- భక్తిశ్రద్ధలతో పోచమ్మ, ముత్యాలమ్మలకు నైవేద్యం సమర్పించిన భక్తులు
- అలరించిన ఆధ్యాత్మిక వాతావరణం

తొలివెలుగు, నిడమనూరు: నిడమనూరు మండల పరిధిలోని రాజన్నగూడెం గ్రామంలో శ్రావణమాస బోనాల వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పాక లింగయ్య నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలో ఎటుచూసినా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను అలంకరించుకుని పూజా కార్యక్రమాలకు సిద్ధమయ్యారు. అనంతరం బోనాలను నెత్తిన ఎత్తుకుని మంగళవాయిద్యాల నడుమ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లారు. భక్తుల నామస్మరణలు, మంగళవాయిద్యాల మధ్య సాగిన బోనాల ఊరేగింపు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామదేవతలైన పోచమ్మ, ముత్యాలమ్మ, బొడ్రాయిల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలకు సుఖశాంతులు, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, కుటుంబాల్లో ఆయురారోగ్యాలు, సంతోషం వెల్లివిరియాలని అమ్మవార్లను ప్రార్థించారు. శ్రావణమాస బోనాల సందర్భంగా గ్రామంలోని మహిళలు, యువత, పెద్దలు ఉత్సాహంగా పాల్గొనడంతో రాజన్నగూడెం పండుగ శోభను సంతరించుకుంది. గ్రామంలోని వివిధ కుల సంఘాల ప్రతినిధులు, యువకులు, మహిళలు, భక్తులు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. పండుగ సందర్భంగా గ్రామంలోని దేవాలయాల వద్ద ప్రత్యేక అలంకరణలు చేపట్టి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాక లింగయ్య నరసింహ మాట్లాడుతూ.. గ్రామదేవతల ఆశీస్సులతో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల ఐక్యత, సంప్రదాయాలను కాపాడుకోవడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో నిర్వహించే బోనాల వేడుకలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బోనాల వేడుకలు ప్రశాంతంగా, ఉత్సాహభరితంగా ముగిశాయి.

# మందమర్రి తహసీల్దార్‌ను వెంబడించిన అనుమానిత వ్యక్తులు

తొలివెలుగు, రామకృష్ణాపూర్ : విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న తనను అనుమానిత వ్యక్తులు కారులో వెంబడించారని మందమర్రి మండల తహసీల్దార్ పి. సతీష్ శర్మ ఆదివారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తనను ఎందుకు అనుసరించారో, దీని వెనుక కారణాలను విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో ఓ మహిళా భవనంలో అక్రమ బియ్యం రవాణా జరుగుతోందంటూ తనకు ఫోన్ కాల్ వచ్చిందని తహసీల్దార్ తెలిపారు. అనుమానంతో మందమర్రి ఎస్ఐ సహాయంతో కస్తూరిబా పాఠశాల ప్రాంతంలో పరిశీలించగా.. అక్కడ ఎలాంటి అక్రమ రవాణా జరగడం లేదని సిబ్బంది నిర్ధారించినట్లు పేర్కొన్నారు. అనంతరం విధులు ముగించుకుని కారులో రామకృష్ణాపూర్‌లోని తన ఇంటికి వెళ్తుండగా.. అనుమానిత వ్యక్తులు ప్రయాణిస్తున్నట్లు భావించిన కారు తనను అనుసరిస్తున్నట్లు గమనించానని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటికి చేరుకుని లోపలికి వెళ్లినప్పటికీ ఆ కారు ఇంటి సమీపంలోనే నిలిపి ఉంచారని తెలిపారు. కొద్దిసేపటి తర్వాత బైక్‌పై వచ్చిన మరో వ్యక్తి ఆ కారులో ఎక్కి కూర్చున్నట్లు వివరించారు. తర్వాత తాను బైక్‌పై శ్రీనివాస గార్డెన్ సమీపంలో ఉన్న తన కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లినప్పటికీ.. అదే కారు తనను అనుసరిస్తూ అక్కడికి వచ్చి వేచి ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు. రాత్రి 10.30 గంటల నుంచి తెల్లవారుజామున 3.30 గంటల వరకు కారు అక్కడే ఉన్నట్లు పేర్కొన్నారు. తనకు ఎవరితోనూ వ్యక్తిగత శత్రుత్వం, వివాదం లేదని తహసీల్దార్ తెలిపారు. అలాంటప్పుడు తనను ఎందుకు అనుసరించారో విచారించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. తన విధుల్లో ఏమైనా తప్పు చేసి ఉంటే చట్టప్రకారం చర్యలకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్ఐ శ్రీధర్ ఈ ఘటనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# CPS రద్దు చేసి OPSను పునరుద్ధరించాలి: ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు ఉద్యోగ సంఘం వినతి..!



తొలివెలుగు, జగిత్యాల : తెలంగాణలో అంతులేని చందా పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్సీపీఎస్ఈయూ) జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్‌కు వారి కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల హామీల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం చందా పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సామాజిక భద్రత మరియు భవిష్యత్తు జీవనాధారం ఈ విధానం వల్ల తీవ్ర ఆందోళనలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీ విరమణ తర్వాత ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేది పాత పెన్షన్ విధానమేనని స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చేలా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్, ప్రధాన కార్యదర్శి సర్వ సతీష్, కోశాధికారి గొల్లపల్లి మహేష్ గౌడ్, రాష్ట్ర నాయకులు బోగ శ్రీను, సందుభట్ల రమేష్, చుక్క కిరణ్ తదితర ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో పల్లెలకు గ్రహణం

- వెయ్యి రోజుల పాలనలో గ్రామాలు ధ్వంసం: మాజీ ఎమ్మెల్యే నోముల భగత్
- హామీల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలం
- పల్లెల్లో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది
- చీపుర్లు పట్టి రోడ్లు ఊడ్చుతూ బీఆర్ఎస్ వినూత్న నిరసన





తొలివెలుగు, నిడమానూరు :కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో రాష్ట్రంలోని పల్లెలు అభివృద్ధికి దూరమై, తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ విమర్శించారు. గ్రామాల్లో కనీస మౌలిక వసతులు సైతం కరువయ్యాయని, పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా నిర్వీర్యమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిరసనగా ఆదివారం నిడమానూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చీపుర్లు పట్టుకుని రోడ్లను ఊడ్చుతూ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా నోముల భగత్ మాట్లాడుతూ.. గత శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ తదితర అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. గతంలో గ్రామాల్లో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమాలను కొనసాగించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి, మౌలిక వసతులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఇకనైనా ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, గ్రామీణ ప్రాంతాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని నోముల భగత్ కోరారు. పల్లెల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ ప్రజల తరపున పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నరాజుకే విఘ్నాలు!









- చిట్యాల రైల్వే బ్రిడ్జి వద్ద నిర్వాహకులకు తప్పని ఇబ్బందులు
- ఒక్క విగ్రహానికి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణ
- గ్యాస్ వెల్డింగ్ పేరుతో మరో రూ.2 వేలు తీసుకుంటున్నారని ఆవేదన
- పరిస్థితిని ఆసరాగా చేసుకుని నిలువుదోపిడీ
- అధిక వసూళ్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

తొలివెలుగు, చిట్యాల: విఘ్నాలను తొలగించే విఘ్నరాజు వినాయకుడికే విఘ్నాలు ఎదురవుతున్నాయి. వినాయక చవితి సమీపిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు గణేశ్ విగ్రహాలను తరలిస్తున్న నిర్వాహకులకు చిట్యాల పట్టణ కేంద్రంలోని జాతీయ రహదారిపై ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద ఇబ్బందులు తప్పడం లేదు. భారీ పరిమాణంలో తయారు చేసిన గణేశ్ విగ్రహాలు బ్రిడ్జి కింద నుంచి వెళ్లే సమయంలో తగిలే పరిస్థితి ఉండటంతో వాటిని సురక్షితంగా తరలించేందుకు నిర్వాహకులు నానా అవస్థలు పడుతున్నారు. కొత్తగూడెంకు చెందిన లింగేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. 20 అడుగులకు పైగా ఎత్తు ఉన్న గణేశ్ విగ్రహాలను రైల్వే బ్రిడ్జి కింద నుంచి తరలించడం ఇబ్బందికరంగా మారుతోంది. ఈ క్రమంలో విగ్రహాలను కొంత మేరకు దించి, బ్రిడ్జి కింద నుంచి తరలించేందుకు క్రేన్ సహాయం తీసుకోవాల్సి వస్తోందని తెలిపారు. ఈ అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు క్రేన్ యజమానులు ఒక్కో విగ్రహానికి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

## గ్యాస్ వెల్డింగ్ పేరుతో అదనపు వసూళ్లు:

విగ్రహాలను బ్రిడ్జి కింద నుంచి తరలించే సమయంలో అవసరమయ్యే గ్యాస్ వెల్డింగ్ పనులకు మరో రూ.2 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారని లింగేశ్వర్ పేర్కొన్నారు. దీంతో ఇప్పటికే విగ్రహాల తయారీ, రవాణా తదితర ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న నిర్వాహకులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గణేశ్ నవరాత్రుల సందర్భంగా విగ్రహాల తరలింపు పెరిగే నేపథ్యంలో బ్రిడ్జి వద్ద ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్వాహకులు కోరుతున్నారు. పండుగ సమయాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు రైల్వే బ్రిడ్జి వద్ద పరిస్థితిని పరిశీలించి, విగ్రహాల తరలింపునకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా క్రేన్ సేవలకు సంబంధించి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై అధికారులు విచారణ చేపట్టి, ధరలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పండుగ సమయాన్ని ఆసరాగా చేసుకుని నిర్వాహకుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేయకుండా సంబంధిత శాఖలు పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, క్రేన్ యజమానులపై చేసిన అధిక వసూళ్ల ఆరోపణలపై సంబంధిత అధికారుల స్పందన తెలియాల్సి ఉంది.

# మన్నెగూడ వద్ద కోడిపందాల స్థావరంపై దాడి.. 22 మంది అరెస్ట్, 35 లక్షల విలువైన ఆస్తులు జప్తు

గండిపేట్: అక్రమ జూదంపై విరుచుకుపడిన పోలీసులు, షాద్‌నగర్ శంషాబాద్ జోన్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్, ఆదిబట్ల పోలీసులు కలసి మన్నెగూడ ఆర్టీవో కార్యాలయం వెనుక నిర్వహిస్తున్న కోడిపందాలు, పేకాట స్థావరంపై దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక పాత పౌల్ట్రీ ఫారమ్‌పై దాడి చేసిన ఉమ్మడి పోలీస్ బృందాలు, అక్కడికక్కడే 22 మందిని అదుపులోకి తీసుకున్నాయి. పాత ఫారమ్‌ను పందెం కోళ్ల పెంపక కేంద్రంగా మార్చి, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి, స్థానిక ప్రాంతాల నుంచి జూదరులను ఆహ్వానించి భోజన వసతి కల్పిస్తూ పందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ దాడిలో సుమారు 35,00,000 రూపాయల విలువైన ఆస్తులు, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 3,60,510 రూపాయల నగదు, 146 కోడి కత్తులు, 20 స్మార్ట్‌ఫోన్లు, 1 స్కోరు పుస్తకం, 9,30,000 రూపాయల విలువైన 31 పందెం కోళ్లు, ఆడి, ఎంజీ, ఎర్టిగా కార్లతో పాటు 3 ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. సంఘటనా స్థలంలో 22 మందిని అరెస్టు చేయగా, ప్రధాన నిర్వాహకుడు, స్థల యజమాని పరారయ్యారు. అరెస్టు చేసిన వ్యక్తులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను తదుపరి విచారణ నిమిత్తం ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే అక్రమ జూద కార్యకలాపాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కే.ఎస్. రావు విజ్ఞప్తి చేశారు. ఈ ఆపరేషన్‌లో శంషాబాద్ జోన్ ఇన్‌స్పెక్టర్ డి. కృష్ణ మోహన్, ఎస్ఐలు కే. మన్సూర్ అలీ, ఎన్. నరసింగరావు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# వర్సిటీల నిధులు రాజకీయం కావొద్దు



రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి సాయంతో ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు గత ఏడాది ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. రెండు హాస్టళ్ల ప్రారంభానికి ఆహ్వానించడంతో సీఎం అదే నెలలో వారికి సమయం ఇచ్చారు. కేసీఆర్ హయాంలోనే మంజూరై నిర్మాణం మొదలైన హాస్టళ్లను ముఖ్యమంత్రి ఆరంభించి, ఠాగూర్ ఆడిటోరియంలో ప్రసంగించడం ఆనాటి కార్యక్రమాలు. విద్యార్థులు, పాలకుల కలయిక అంటే భద్రతా సిబ్బందికి కత్తి మీద సామే. సీఎం కార్యక్రమంలో ఎలాంటి నిరసనలు ఉండకూడదని ముందురోజు రాత్రే బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులను గృహ నిర్బంధం చేశారు. విద్యార్థులు సమూహాలుగా రాకుండా ఇనుప కంచెలు మొలిచాయి. ఉత్సాహంగా సీఎం యూనివర్సిటీ అభివృద్ధి పనులకు రూ.వెయ్యి కోట్లు హామీ ఇస్తూ డిసెంబర్‌లో మరో సమావేశం పెట్టుకుందామన్నారు. సీఎం అన్నట్లుగానే వర్సిటీ రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం నుంచి రూ.వెయ్యి కోట్ల మంజూరు ఉత్తర్వు వచ్చేసింది. అదే ఏడాది డిసెంబర్ 10వ తేదీన ఆర్ట్స్ కాలేజీ ముందు అశేష విద్యార్థుల సమక్షంలో ఆ జీవో కాపీని రేవంత్‌రెడ్డి అధికారులకు అందజేశారు. 109 ఏండ్ల చరిత్ర గల ఉస్మానియా యూనివర్సిటీకి ఏ ప్రభుత్వమూ ఒక్కసారిగా ఇంత సొమ్మును ప్రకటించలేదు. అధికారులు, అధ్యాపకులు, విద్యార్థుల కండ్లల్లో కొత్త భవనాలు, ఆధునిక వసతుల ఊహలు వెలిగిపోయాయి. అధికారులు సీఎంకు ధన్యవాదాలు తెలియజేస్తూ 'కొత్త భవనాలు ఉంటే సరిపోదు. వెయ్యికి పైగా ఉన్న బోధనా సిబ్బంది ఖాళీలను కూడా పూరిస్తేనే తగిన ప్రయోజనం ఉంటుంది' అని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. అదేరోజు విద్యార్థులు సూచనలు, ఆలోచనలను తమతో పంచుకోవాలని ఒక క్యూఆర్ కోడ్‌ను కూడా సీఎం విడుదల చేశారు. కానీ ఆ కోడ్‌ను ఎప్పుడు స్కాన్ చేసినా ఏ సర్వర్‌కు దీనిని అనుసంధానించలేదని మెసేజ్ వస్తున్నది. అది అలా ఉండగా ఇంతవరకు సీఎం అందించిన జీవో 189 ప్రకారం రూ.వెయ్యి కోట్లలో ఒక్క విడత కూడా నిధులు యూనివర్సిటీ అధికారులకు చేరిన దాఖలాలు లేవు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిధులను వెంటనే విడుదల చేయాలని ఈ ఏడాది మే 26న వర్సిటీ అధికారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో విద్య కోసం 8.2 % నిధులను కేటాయించింది. ఇదే సంవత్సరంలో కర్ణాటక, 12%, ఏపీ 14% బడ్జెట్ విద్యకు అందిస్తున్నాయి. కాంగ్రెస్ నేతలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యాభివృద్ధి కోసం కనీసం 15% నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం నియమించిన తెలంగాణ విద్యా కమిషన్ 18% నిధులను విద్యకు వెచ్చించాలని సూచించింది. 2026-27 బడ్జెట్ కేటాయింపు ప్రకారం రూ.26,587 కోట్లు విద్యా విభాగానికి వస్తే అందులో రూ.21 వేల కోట్లు స్కూల్ ఎడ్యుకేషన్‌కే అవసరం. అయితే ఈ కేటాయింపు ప్రభుత్వ విద్యాసంస్థల నిర్వహణ, అభివృద్ధికి చెందుతుంది. నిర్వహణలో సిబ్బంది జీతభత్యాలు, అభివృద్ధి అంటే కొత్త నిర్మాణాలు, కొనుగోళ్లు వస్తాయి. ప్రభుత్వ నిధులు దేనికి విడుదల చేస్తే దానికే వాడుకోవాలి. కేటాయింపు అభివృద్ధి పేరిట వస్తేనే విద్యాసంస్థల సదుపాయాలకు వర్తిస్తుంది. 2025-26 బడ్జెట్‌లో యూనివర్సిటీల అభివృద్ధి కోసం రూ.500 కోట్లు కేటాయిస్తే కేవలం రూ.5 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. సాంకేతిక విద్యకు వెచ్చించాల్సిన రూ.14 కోట్లలో ఒక కోటి మాత్రమే విడుదలైంది. హైదరాబాద్‌లోని మరో ప్రతిష్టాత్మక కోఠి మహిళా కళాశాలకు 2022లో బీఆర్ఎస్ ప్రభుత్వం యూనివర్సిటీ హోదా కల్పించి 'తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం' అని నామకరణం చేసింది. 2024లో ప్రస్తుత ప్రభుత్వం ఆ యూనివర్సిటీ పేరులో 'తెలంగాణ'ను తొలగించి 'వీరనారి చాకలి ఐలమ్మ' పేరును చేర్చింది. ఉస్మానియా యూనివర్సిటీ మాదిరిగానే ఈ విద్యాసంస్థకు కూడా ప్రభుత్వం ఈ ఏడాది రూ.514 కోట్లు కేటాయించింది. అయితే ఈ సంస్థకు ఇప్పటివరకు రూ.100 కోట్లకు పైగా నిధులు విడుదలైనట్లు తెలుస్తున్నది. ఓయూకు రావలసిన రూ.వెయ్యి కోట్లకు తగినట్లు ప్రణాళికలను అధికారులు సిద్ధం చేశారు.

# అవును.. భారత్ ప్రతిఘటిస్తున్నది



దేశంలో జరుగుతున్న ప్రజావ్యతిరేక పాలనపై యువత తప్పకుండా స్పందించే సమయం వస్తుందని కేసీఆర్ రెండేండ్ల క్రితం అన్నారు. ఇండియా రియాక్ట్స్ అంటూ ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. కేసీఆర్ చెప్పిన మాటలు నేడు అక్షర సత్యాలని నిరూపితమవుతున్నది. జంతర్ మంతర్‌లో విద్యార్థుల నిరసన ఉద్యమం తాజా నిదర్శనం. నాడు ఈస్టిండియా పాలకుల దోపిడీని ప్రతిఘటిస్తూ గాంధీజీ నాయకత్వాన అహింసా ఉద్యమం ప్రబలినట్టే నేడు యువత పోరాటబాట పట్టింది. బీజేపీ పన్నెండేండ్ల పాలనలో ప్రకృతి వనరులు, ప్రభుత్వ భూములు, సంస్థలు, అడవులు, అయోధ్య రామాలయ విరాళాల దోపిడీ వ్యవహారాలు వెలుగుచూశాయి. లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాల ఎగవేతలు యథేచ్ఛగా జరిగాయి. 152 సార్లు పబ్లిక్ పరీక్ష ప్రశ్నాపత్రాలను కూడా అమ్ముకుతింటున్న ముఠాల వ్యవహారం బయటపడింది. దేశంలో సాగుతున్న నిత్య దోపిడీని ప్రతిఘటిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నాయకత్వాన నిరసన ఉద్యమం ప్రజ్వరిల్లింది. దీన్ని కప్పిపెట్టేందుకు జాతీయ మీడియా చెమటోడ్చింది. అయినాసరే జర్నలిస్టులు, సోషల్ మీడియా ప్రతినిధులు, యువత, విద్యార్థులు ఉద్యమాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఉద్యమంలో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాది విద్యార్థులు చేరుకున్నారు. ఆకాశం కప్పుకింద, దిక్కుల గోడల మధ్య, నేలపైనే నిద్రిస్తూ నిరసన తెలిపారు. ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారా ఆ బిడ్డలకు అన్నపానీయాలను పంపడం, డాక్టర్లు ఉచిత వైద్యసేవలు, మందులు అందించడం వంటి వీడియోలు వైరల్‌గా మారాయి. వివిధ మతాల పెద్దలు తమ ప్రార్థనా మందిరాల్లో నిరసనకారులు సేదదీర్చుకునేలా ఏర్పాట్లు చేయడం, రాత్రిపూట విద్యార్థులకు విసనకర్రలతో స్థానికులు సేవలు అందించడం, అన్ని మతాల ప్రజలు కలసికట్టుగా నినదిస్తూ ఉద్యమించడం వంటి దృశ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బీజేపీపై ఉద్యమం అంటే భయంతో వెనుకంజవేసేవాళ్లకు కూడా ఆత్మస్థైర్యాన్ని కలిగించాయి. మేం భారతీయులం మేమంతా ఒక్కటే అంటూ కుల, మత, ప్రాంతాలకు అతీతంగా యువతరం కదం తొక్కింది. శభాష్ విద్యార్థులారా! యువతీయువకులారా! భారతమాతకు అద్భుతమైన బిడ్డలు అని చాటిచెప్పారు. హేమాహేమీ రాజకీయ పార్టీల నేతలు సైతం జంకుతుంటే, నిర్భయంగా నిరసన గళమెత్తిన వీరులుగా నిలిచారు. ఎదురించేవాళ్లు లేనంతకాలం, బెదిరించేవారిదే రాజ్యం అనేది నానుడి. కానీ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన రైతులు, పేపర్ లీకేజీలపై ఉద్యమించిన విద్యార్థులు దేశానికి దిశానిర్దేశం చేశారు. నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయిన భారతీయులందరికీ మార్గదర్శకులుగా నిలిచారు. ప్రజావ్యతిరేక విధానాలతో మోదీ ప్రభుత్వం నానాటికీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నది. జంతర్ మంతర్ ఉద్యమమే కాదు, నిన్నటి ఉపఎన్నికల ఫలితాలూ అందుకు సాక్ష్యాలే. ముఖ్యంగా 1995 నుంచి బీజేపీకి వరుస విజయాలను అందిస్తూ వచ్చిన బిహార్‌లోని బాంకీపూర్ నియోజకవర్గంలో జరిగిన ఉపన్నికలో బీజేపీ పరాజయం అందుకు సుస్పష్ట సంకేతం. గుజరాత్‌లో జరిగిన ఒక ఉపఎన్నికలో బీజేపీ గెలిచినా, గత ఎన్నికలో సాధించిన లక్ష మెజారిటీ కాస్త, 30 వేలకు పడిపోయింది. ప్రజలు తమ పట్ల ఆగ్రహంగా ఉన్నారనే సంగతి మోదీకి, ఆయన అంధభక్తులు, వీరాభిమానులు గుర్తించే ఉంటారు. అయినా అధికార అహంకారం తప్ప, ఏమాత్రం సామాజిక స్పృహ చూపడంలేదు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను అంగీకరించడంలేదు. ప్రశ్నించిన వాళ్లను బూతులతో ట్రోల్ చేస్తున్నారు. అలాంటి విద్వేషపూరిత వ్యక్తులు ఇప్పటికైనా మాజీ ప్రధాని, అటల్ బిహారీ వాజపేయి సూచనను తెలుసుకోవాలి, గుర్తుచేసుకోవాలి. నీ అభిమాన పార్టీ చేస్తున్న తప్పుల పట్ల మౌనం వహిస్తే, అప్పుడు నువ్వు దేశ ప్రేమికుడివి కాదు. పార్టీ ప్రేమికుడివి మాత్రమే. పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయి. దేశమే శాశ్వతం. దేశం కోసం పార్టీ తప్పుల్ని ప్రశ్నించాలి. అవసరమనుకుంటే ప్రతిఘటించాలి. అవీ వాజపేయి చెప్పిన మాటలు. ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అమలుపరుస్తున్న మోదీ ప్రభుత్వం, ప్రజల దృష్టిని మరల్చేందుకు పథకం ప్రకారం వ్యవహరిస్తున్నది. మోదీ విధానాలు అన్నీ కూడా దేశం కోసం-ధర్మం కోసం అంటూ కార్పొరేట్ మీడియా, వాట్సాప్ యూనివర్సిటీ, సంఘ్ పరివార్ కార్యకర్తలు, ఆయన అంధభక్తులు నిత్యం హోరెత్తిస్తున్నారు. ప్రశ్నిస్తే అరెస్టులు, నిలదీస్తే దేశద్రోహి అంటూ నిందలు వేస్తున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపించే ప్రతిపక్ష పార్టీల నేతలపై ఈడీ, ఐటీ, సీబీఐ కేసులతో మోదీ ప్రభుత్వం వేధిస్తున్నది. అడవులు నరికి ప్రకృతి సంపదను స్వాధీనం చేసుకోవడానికి అడ్డుగా ఉన్న గిరిజనులను హింసాత్మక పద్ధతులతో అణచివేస్తున్నది. మీడియా, ఎన్నికల కమిషన్ వంటి వ్యవస్థలను పూర్తిగా రిమోట్ కంట్రోల్‌తో నడిపిస్తున్నది. ఎన్నికలకు ముందుగా పుల్వామా, పహల్గాం, సర్జికల్ స్ట్రైక్స్, పాకిస్థాన్ ఉగ్రవాదం, చైనా దురాక్రమణ వంటి భావోద్వేగమైన అంశాలతో ఓటర్లను ఆకట్టుకోవడం, తాము చేసే ప్రజావ్యతిరేక చట్టాల ఆమోదం కోసం త్రిశూలదాడులు, కేసులకు లొంగివచ్చిన వారికి తమ కండువా కప్పుతూ, ఏక్‌నాథ్ షిండే మాడల్‌లో ప్రభుత్వాల్లో చీలికలు సృష్టించడం, బీజేపీలో విలీనం చేసుకోవడం ద్వారా తన బలం పెంచుకుంటున్నది. ఉత్తర భారత ఓటర్లలా మతతత్వానికి లొంగని దక్షిణ భారత ఓటర్లతో, వాళ్ల ఎంపీలతో పనిలేకుండానే రాజ్యాధికారం కైవసం చేసుకోవడానికి వీలుగా నియోజకవర్గాల పునర్విభజన, జమిలీ ఎన్నికల విధానాన్ని తెరపైకి తీసుకొస్తున్నది. మరోవైపు ఎన్నికల కమిషన్ సహకారంతో తమకు వ్యతిరేకంగా ఉన్న రాష్ట్రాల్లో ఓటర్లను తొలగిస్తున్నది. మరోవైపు ఈవీఎంలతో మాయాజాలం చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారం కోసం బీజేపీ ఇంతటి పకడ్బందీ కుట్రపూరిత ప్రణాళికలను అమలు చేస్తూ అజేయులమన్న ధీమాతో ఉన్నది. కానీ జంతర్ మంతర్ మీదుగా లక్షలాది విద్యార్థులు ప్రభుత్వంపైకి పిడుగుల్లా వచ్చిపడ్డారు. సరే తమ విధానాలను మార్చుకోవటానికి ఇష్టపడని ప్రభుత్వం, న్యాయం కోసం పోరాడుతున్న ఆ బిడ్డలపై క్రూరాతిక్రూరమైన అణచివేత చర్యలకు పూనుకొన్నది. మోదీ ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు, గుర్తుతెలియని గూండాలు ఆడామగ, చిన్నాపెద్ద తేడా లేకుండా పెల్లెట్‌గన్‌లు, మేకులు కొట్టిన లాఠీలతో చితగ్గొట్టారు. తలల నుంచి కారుతున్న రక్తంతో ఆర్తనాదాలు పెడుతున్న ఆ పిల్లలను చూస్తూ కూడా చలించని మోదీ, తనను దూషించారంటూ ఆవేదనతో వీడియో విడుదల చేశారు.



# ముగుస్తున్న మోదీ మాడల్

సంఘ్ పరివార్ సుదీర్ఘ ప్రస్థానంలో మూడవది అయిన మోదీ మాడల్ ముగింపు దశలోకి ప్రవేశిస్తున్నది. ఆర్ఎస్ఎస్ 1925లో ఏర్పడినప్పటి నుంచి వాజపేయి ప్రధానమంత్రిత్వ కాలం (1998-2004) ముందు వరకు గలది మొదటిదశ. ఆయన కాలం పరివార్‌కు రెండవ దశ కావడమే గాక, దేశంలో పరివార్ శక్తుల పాలనకు మొదటి మాడల్ అయింది. తర్వాత పదేండ్లకు (2014) మోదీ పరిపాలనా రూపంలో మూడవ దశ రెండవ మాడల్‌గా అవతరించింది. అది ఇక అంతరిస్తున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సంఘ్ పరివార్‌కు ఒక నిర్దిష్టమైన, బలమైన సైద్ధాంతిక పునాది ఉన్నది. ఈ దేశంలో సాధారణ రూపంలో గల సుదీర్ఘ సంస్కృతితోపాటు, 20వ శతాబ్ద ఆరంభ కాలంలో ఉండిన రాజకీయ పరిస్థితులు ఆ పునాదిని సృష్టించాయి. సంస్థ నాయకత్వం సుమారు రెండున్నర దశాబ్దాలపాటు తమకు రాజకీయాలతో పని లేదని, భావజాల వ్యాప్తి ద్వారా హిందూ సమాజాన్ని ఒకటి చేయగలమని చెప్తూ పోయింది. 1947లో స్వాతంత్ర్యానంతరం మేధోమథనాల ఫలితంగా మొదట 1951లో జనసంఘ్ పేరిట రాజకీయ పార్టీ ఏర్పడి, తర్వాత 1980లో బీజేపీగా రూపాంతరం చెందింది. 1951-80 మధ్య రాజకీయాలలో వ్యవహరించిన తీరు, అందులోని మంచిచెడులు, పరివార్ సిద్ధాంతాలకు కట్టుబడినది ఎంత, కానిదెంత, పార్టీపై పరివార్ నియంత్రణ ఏమిటి, పడిన రాజీలేమిటి, ఆ కాలమంతా ఒక రాజకీయ సాధనంగా పరివార్ లక్ష్యాలను ముందుకు తీసుకుపోయింది ఎంత అనేదంతా ఒక సవివరమైన చర్చ. అది ఇక్కడ అప్రస్తుతం. ఒకమాట మాత్రం చెప్పుకోవాలి. ఒకవైపు నుంచి పరివార్ సైద్ధాంతిక నియంత్రణలు, మరొకవైపు నుంచి రాజకీయ నాయకత్వాల వ్యవహరణలు కొద్దిపాటి సర్దుబాట్లు, రాజీలతో అంతా సజావుగానే ముందుకు సాగాయి. 1980లో బీజేపీ ఏర్పడటానికి ముందు రెండేండ్లలోని జనతా పార్టీ ప్రభుత్వ కాలం (1977-79), ఆ తర్వాత నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వ కాలం (1989-90) పరివార్ ఆలోచనలలో, రాజకీయ నాయకత్వపు ఆలోచనలలో కూడా గణనీయ మార్పును తెచ్చాయి. ఆ రెండు ప్రభుత్వాలలో భాగస్వాములు కావడం అందుకు కారణం. అంతకుముందు కూడా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలలో అధికారాన్ని నెరపినప్పటికీ ఇవి రెండు కేంద్రస్థాయి అధికారాలయ్యాయి. ఆ స్థాయి అధికారమంటే ఏమిటో అనుభవపూర్వకంగా తెలిసివచ్చింది. కేవలం అధికారమనే రూపంలోనే కాదు. అధికారాన్ని ఉపయోగించుకుని పరివార్ సిద్ధాంతాలను ముందుకు తీసుకుపోవచ్చుననే ఆలోచనలు జనసంఘ్ స్థాపన కాలం నుంచే ఉండగా, తొలిదశలో రాష్ట్రాలకు పరిమితమై ఉండిన ఆ వ్యూహం ఇప్పుడు జాతీయస్థాయికి చేరింది. జనతా పార్టీ, నేషనల్ ఫ్రంట్ భంగపాట్ల దరిమిలా, స్వయంగానే అధికారానికి రావాలన్న పట్టుదల పెరిగింది. అది రాజకీయ నాయకత్వంలో, పరివార్ నాయకత్వంలో కూడా కనిపించింది. ఆ సమయంలో దేశంలో రాజకీయ శూన్యత, అభివృద్ధిపరంగా, సామాజికంగా ప్రజల నిరాశలన్నవి ఆవరించి ఉన్నాయి. రాజకీయంగా కాంగ్రెస్ విఫలమై ఉన్నది. అందుకు ప్రత్యామ్నాయం కాగలమంటూ వచ్చిన జనతా పార్టీ, నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు నిలువలేకపోయాయి. ఇంకొక స్థాయిలో ఆర్థిక, అభివృద్ధి రంగాలు అస్తవ్యస్తం కాసాగాయి. సరిగా ఆ శూన్యం నుంచి ఒక కొత్త ఆశగా వాజ్‌పేయి ప్రభుత్వం (1998-2004) ఆవిర్భవించింది. వాజపేయి, ఆద్వానీ వంటి దిగ్గజాల నాయకత్వాన సమస్యల పరిష్కారానికి, అభ్యున్నతికి చాలా ఆశలు కల్పించింది. ఆ విధంగా, పరివార్ కుటుంబం నుంచి జాతీయ స్థాయిలో మొదటి పరిపాలనా మాడల్ ప్రజల ముందుకు వచ్చింది. వాజ్‌పేయి, అద్వానీ ప్రతిష్ట, సమర్థతలు సుప్రసిద్ధమైనవి గనుక, అందుకు అనుగుణంగా పరిపాలన జనరంజకంగా సాగినాకొద్దీ, ఆ స్థితిని అనువుగా చేసుకుంటూ, నేటుగా చాటుగా కూడా తమ దీర్ఘకాలిక లక్ష్యాలను ముందుకు తీసుకుపోగలమని సంఘ్ పరివార్ ఆశించింది. అందుకు కేంద్రంలో తమ పాలన సుస్థిరం, దీర్ఘకాలికం కావటం అవసరం గనుక, ఆ ప్రయోజనం కోసమని సైద్ధాంతికంగా అంతకుముందు లేనంత రాజీలకు సైతం సిద్ధపడింది. సిద్ధాంతానికి ఎక్కువ కట్టుబడతారనే పేరున్న అద్వానీని నియంత్రిస్తూ, కొంత తక్కువ కట్టుబడతారనే పేరుగల పేజ్‌పేయికి వెసులుబాట్లు కల్పించింది. ఆర్థిక విధానాలలోనూ స్వదేశీకి కొంత చిన్న పీట వేసి, విదేశీకి, భారీ వ్యాపార సంస్థలకు పెద్ద పీట వేసి సరిపెట్టుకుంది. మెం-త్తం మీద ఆ విధంగా మొదటి మాడల్ రూపుతీసుకుంది. అది ముందుకు సాగడంపైన మూడు ప్రభావాలు కనిపించాయి. ఒకటి, స్వభావరీత్యా వాజ్‌పేయి కొంత ఉదారవాది, ప్రగతిశీలుడు కావటం. రెండు, ప్రభుత్వం నిలిచేందుకు పలు ఇతర పార్టీలపై ఆధారపడవలసి రావడం. మూడు, ఆర్థిక సంస్కరణలు అమలుకు రావటం అప్పటికే (1991 నుంచి) జరిగిపోయినందున వాటికి కట్టుబడక తప్పనిస్థితి. అయినప్పటికీ తాము దేశం కోసం చాలా చేశామని ఆ ప్రభుత్వం, సంఘ్ పరివార్ కూడా చాలా నమ్మాయి. 2004 ఎన్నికలలో ఇండియా షైనింగ్ పేరిట ఉధృతమైన ప్రచారాన్ని నడిపాయి. రాజకీయంగా బీజేపీ, సామాజిక స్థాయిలో పరివార్. కానీ, ఎన్నికల ఫలితాలు వెలువడేసరికి, ఆ మొదటి మాడల్‌ను ప్రజలు తిరస్కరించినట్టు తేలింది. కాంగ్రెస్ కూటమి పదేండ్లు (2004-2014) పాలించి విఫలమైన వెనుక, మోదీ నాయకత్వాన పరివార్ నుంచి రెండవ మాడల్ పాలన ముందుకొచ్చింది. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండిన (2001-14) కాలంలో పాలించిన తీరు గురించి గుజరాత్ మాడల్ అనే ప్రచారాన్ని 2014 ఎన్నికలలో దేశవ్యాప్తంగా హోరెత్తించారు. ఆయన అక్కడ అద్భుతమైన అభివృద్ధి సాధించారని, అవినీతిని పూర్తిగా అరికట్టారని, ఉద్యోగ ఉపాధులు బాగా కల్పించారని, అన్నివర్గాల ప్రజ లు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని, ప్రభుత్వ యంత్రాంగం ఎంతో సమర్థవంతంగా పని చేస్తున్నదని వగైరా. ఆయన ప్రధాని అయితే అదే తరహా మాడల్‌ను దేశవ్యాప్తం చేస్తారని అన్నారు.



# కియా వారి నయా కారు: రేటెంతో తెలుసా?

కియా మోటార్స్ భారతదేశంలో కొత్త సోరెంటో ఎస్‌యూవీని రూ. 27.99 లక్షల (ఎక్స్-షోరూమ్) ప్రారంభ ధరతో లాంచ్ చేసింది. ఇది ఇండియన్ మార్కెట్లో ఇప్పటికే అమ్మకానికి ఉన్న టయోటా ఫార్చ్యూనర్, స్కోడా కోడియాక్, జీప్ మెరిడియన్, ఫోక్స్‌వ్యాగన్ టేరాన్ వంటి మోడళ్లకు ప్రత్యర్థిగా ఉంటుంది. మల్టిపుల్ వేరియంట్లలో అందుబాటులో ఉన్న కియా సోరెంటో 6 సీటర్, 7 సీటర్ రూపంలో అందుబాటులో ఉంది. ఇది 4,815 మిమీ పొడవు, 1,900 మిమీ వెడల్పు, 1,785 మిమీ ఎత్తును కలిగి ఉంది. దీని వీల్‌బేస్ 2,815 మిమీ వరకు ఉంటుంది. కియా సోరెంటో నిలువుగా అమర్చిన హెడ్‌ల్యాంప్‌లు, టైగర్-నోస్ గ్రిల్ వంటి వాటిని పొందుతుంది. ఇందులో 18 ఇంచెస్ అల్లాయ్ వీల్స్ ఉన్నాయి. వెనుక భాగం కూడా ముందు భాగాన్ని పోలి ఉండేలా నిలువుగా అమర్చిన టెయిల్ ల్యాంప్‌లు ఉన్నాయి. ఇది మొత్తం 8 రంగులలో లభిస్తుంది. సరికొత్త కియా సోరెంటో 4 ఇంచెస్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో కూడిన 12.3-అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్ లేదా దానికి సరిపోయే 12.3-అంగుళాల డిజిటల్ డిస్‌ప్లే పొందుతుంది. కియా కనెక్ట్ 2.0, ఓవర్-ది-ఎయిర్ అప్‌డేట్‌లు, డిజిటల్ కీ, హెడ్-అప్ డిస్‌ప్లే, జనరేటివ్-ాా× అసిస్టెంట్ వంటివి కూడా ఉన్నాయి. ఇవి కాకుండా.. వెంటిలేటెడ్ ఫ్రంట్ అండ్ రియర్ రో సీట్లు, 10-వే ఎలక్ట్రిక్ డ్రైవర్ సీటు, ముందు ప్రయాణీకుడి సీటు కోసం పవర్ అడ్జస్ట్, పనోరమిక్ సన్‌రూఫ్, యాంబియంట్ లైటింగ్, పవర్డ్ టెయిల్‌గేట్, 12-స్పీకర్ల బోస్ ఆడియో సిస్టమ్ వంటికి ఉన్నాయి. సేఫ్టీ విషయానికి వస్తే.. ఇందులో ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, 26-ఫీచర్ల భద్రతా ప్యాకేజీ ఉన్నాయి. టాప్ ఎండ్ మోడల్స్ పది ఎయిర్‌బ్యాగ్‌లు, 28 వరకు భద్రతా ఫీచర్లను పొందుతాయి. ఇందులో లెవెల్ 2ం ఏడీఏఎస్, సరౌండ్-వ్యూ, బ్లైండ్-వ్యూ మానిటర్లు, రిమోట్ పార్కింగ్ అసిస్టెన్స్, డిజిటల్ ఇన్‌సైడ్ రియర్-వ్యూ మిర్రర్, ఫ్రంట్ అండ్ రియర్ డాష్‌క్యామ్, మల్టీ-కొలిజన్ బ్రేకింగ్ ఉన్నాయి. కియా సోరెంటో అనేది స్ట్రాంగ్-హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్, ఆల్-వీల్ డ్రైవ్ పొందిన కియా ఇండియా మొదటి మోడల్. ఇది డీజిల్ ఇంజన్‌ను కూడా అందిస్తుంది. హైబ్రిడ్ వెర్షన్‌లో 1.6-లీటర్ పెట్రోల్ ఇంజన్‌తో పాటు ఒక ఎలక్ట్రిక్ మోటార్ లభిస్తుంది. ఇంజన్ 180 హార్స్ పవర్ ఉత్పత్తి చేయగా, ఎలక్ట్రిక్ మోటార్ 65 హార్స్ పవర్ అందిస్తుంది. ఈ రెండింటి సంయుక్త అవుట్‌పుట్ 238హార్స్ పవర్. హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్ 265 ఎన్ఎమ్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది.

# బబుల్ రాప్ ఎలా పుట్టిందో తెలిస్తే షాకే!

బబుల్ రాప్.. ఈ రోజుల్లో దీని పాత్ర చెప్పలేనిది. ఆన్‌లైన్ షాపింగ్ వచ్చాక ప్యాకేజింగ్‌లో దీని అవసరం ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయింది. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, గృహోపకరణాలు, గాజు వస్తువులు ఒక్కటేమిటీ ప్రతీ వస్తువుకు రక్షణ కవచంలా మారిపోయింది. మరి ఇంతలా వినియోగిస్తున్న ఈ బబుల్ రాప్ కవర్.. బబుల్ రాప్ కథ అమెరికాలోని న్యూజెర్సీలో 1957లో మొదలైంది. ఆల్ఫ్రెడ్ ఫీల్డింగ్, మార్క్ చవాన్నెస్ అనే ఇద్దరు ఇంజనీర్లు తమ గ్యారేజీలో పని చేస్తూ.. గోడలకు ఒక కొత్త స్టైల్ ఇవ్వడానికి ప్లాస్టిక్ వాల్‌పేపర్‌ను తయారు చేయాలని భావించారు. దీని కోసం రెండు ప్లాస్టిక్ షీట్లను ఒక యంత్రం సాయంతో అతికించడానికి ప్రయత్నించారు. ఈ ప్రయోగం చేస్తున్నప్పుడు, యంత్రంలో ఒక చిన్న సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండు ప్లాస్టిక్ షీట్ల మధ్య చిన్నచిన్న గాలి బుడగలు చిక్కుకుపోయాయి. బయటకు వచ్చిన షీట్ సాదాగా కాకుండా, బుడగలతో నిండి ఉంది. అయితే ఈ బుడగల వాల్ పేపర్ వినియోగదారులను అంతగా ఆకట్టుకోలేదు. 1960లో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. బబుల్ రాప్‌కి మంచిరోజులొచ్చాయి. అప్పట్లో ఐబీఎం సంస్థ 1401 కంప్యూటర్‌ను లాంచ్ చేసింది. అది చాలా సున్నితమైన యంత్రం, కాబట్టి దానిని ఒక చోటు నుంచి మరో చోటుకు తరలించడం పెద్ద సవాలుగా మారింది. అప్పుడు మార్క్ చవాన్నెస్ ఈ బబుల్ ప్లాస్టిక్‌ను ఆ సంస్థకి చూపించారు. ఆ గాలి బుడగలు వస్తువులకు రక్షణ కవచంలా పనిచేస్తాయని ఐబీఎం ఇంజనీర్లు గుర్తించారు. అలా తమ కంప్యూటర్లను సురక్షితంగా రవాణా చేయడానికి దీనిని వాడటం మొదలుపెట్టారు. దీంతో బబుల్ రాప్‌కు డిమాండ్ విపరీతంగా పెరిగింది. నేటి ఈ--కామర్స్ కాలంలో ఈ బబుల్ రాప్ లేని పార్సిల్స్‌ను ఊహించడం అసాధ్యం.



# ఎన్ఎస్ఈ ఐపీఓ వచ్చేస్తోంది!

## మెగా ఆఫర్‌కు సెబీ సై..

## ఒక్కో షేరు రూ. 2,000!

## రూ. 30,000 కోట్లపై కన్ను

## అతిపెద్ద ఇష్యూగా రికార్డ్!




న్యూఢిల్లీ: దాదాపు దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న స్టాక్ ఎక్ట?్స్ఛంజీ దిగ్గజం లిస్టింగ్‌కు ఎట్టకేలకు తెరలేచింది. నేషనల్ స్టాక్ ఎక్ట?్స్ఛంజీ(ఎన్ఎస్ఈ) పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పచ్చ జెండా ఊపింది. ప్రపంచంలోనే అతిపెద్ద డెరివేటివ్స్ ఎక్ట?్స్ఛంజీగా నిలుస్తున్న ఎన్ఎస్ఈ.. సెబీ ఆమోదంతో లిస్టింగ్ ప్రణాళికలను వేగవంతం చేయనుంది. వచ్చే వారమే ధరల శ్రేణిని వెల్లడించనున్నట్లు తెలుస్తోంది. తద్వారా ఈ నెల 15కల్లా ఐపీవోకు తెరతీయనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

**టాప్--10లోకి...**

ఐపీవోలో భాగంగా ఎన్ఎస్ఈ వాటా మూలధనంలో 6 శాతానికి సమానమైన 14.89 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. తద్వారా రూ. 30,000 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉంది. దీంతో హ్యుందాయ్ మోటార్ ఇండియా, ఎల్ఐసీ, పేటీఎమ్, టాటా క్యాపిటల్, కోల్ ఇండియా ఇష్యూలను అధిగమించి అతిపెద్ద ఐపీవోగా నిలిచే వీలుంది. మరోపక్క జియో ప్లాట్‌ఫామ్స్ సైతం రూ. 37,700 కోట్ల మెగా ఐపీవో కోసం చురుగ్గా సన్నాహాలు చేస్తోంది. ఎన్ఎస్ఈ లిస్టయితే దేశీయంగా మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) రీత్యా టాప్--10లో నిలిచే అవకాశముంది. 1.8 లక్షలమంది వాటాదారులతో రూ. 5 లక్షల కోట్లకుపైగా మార్కెట్ విలువను అందుకోవచ్చని అంచనా.

**2016లో చెక్...**

ఎన్ఎస్ఈ తొలుత 2016 డిసెంబర్‌లో పబ్లిక్ ఇష్యూ(రూ. 10,000 కోట్ల సమీకరణ)కు ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. అయితే లిస్టింగ్ ప్రణాళికలకు నియంత్రణ, న్యాయ, పాలనా సంబంధ వివాదాలు అడ్డుపడుతూ వచ్చాయి. ఆపై అవాంతరాల కారణంగా 2019, 2020, 2024లో ఎన్‌వోసీ కోసం పత్రాలు దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో వివాద పరిష్కారాలకుగాను సెబీకి రూ. 1,491 కోట్లకుపైగా చెల్లించింది. ఎప్పటినుంచో నడుస్తున్న కోలొకేషన్, డార్క్‌ఫైబర్ కేసులపై ఈ వారం సుప్రీం కోర్టు సెబీ అప్పీల్‌ను కొట్టివేసిన నేపథ్యంలో ఎన్ఎస్ఈకి ఉపశమనం లభించింది. ఆపై తాజాగా సెబీ నుంచి అనుమతి పొందింది.

**వాటాదారులు ఇలా...**

ఐపీవోలో ప్రస్తుత వాటాదారు సంస్థలు ఈక్విటీ వాటాలను ఆఫర్ చేయనున్నాయి. తద్వారా తమ వాటాలను విక్రయించేందుకు(మానిటైజ్) వీలు చిక్కనుంది. దీంతో నిధులు ఎక్ట?్స్ఛంజీకి చేరబోవు. బ్యాంకర్ల అంచనా ప్రకారం ఎన్ఎస్ఈ ఐపీవో ధర రూ. 2,000గా ఉండవచ్చు. ఈ నెల 11కల్లా ధరల శ్రేణిని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఎన్ఎస్ఈ ఐపీవోలో బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ 2.48 కోట్ల షేర్లు, ఎంఎస్ స్ట్రాటజిక్(మారిషస్) 1.6 కోట్ల షేర్లు చొప్పున ఆఫర్ చేయనున్నాయి. ఈ జాబితాలో కెనడా పెన్షన్ ప్లాన్, అరండా ఇన్వెస్ట్‌మెంట్స్, బీవోబీ, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్, జీఐసీసహా ఇతర బీమా కంపెనీలు చేరాయి. అయితే అతిపెద్ద వాటాదారు(10.72 శాతం) ఎల్ఐసీ షేర్లను విక్రయించడం లేదు. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో ఎస్‌బీఐ వాటా 3.23 శాతంకాగా.. ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్‌కు 4.33 శాతం, స్టాక్ హోల్డింగ్‌కు 4.44 శాతం చొప్పున వాటా ఉంది.

**డెరివేటివ్స్ కింగ్**

దేశీయంగా ఈక్విటీ డెరివేటివ్స్ మార్కెట్లో ఎన్ఎస్ఈ ఆధిపత్యం వహిస్తోంది. ట్రేడవుతున్న కాంట్రాక్టులరీత్యా ప్రపంచంలోనే అత్యంత రద్దీగల ఎక్ట?్స్ఛంజీగా నిలుస్తోంది. ఇక గతేడాది(2025--26)లో మొత్తం ఆదాయం రూ. 18,713 కోట్లుకాగా.. నికర లాభం 15 శాతం తగ్గి రూ. 10,302 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2024--25) ఆదాయం రూ. 19,177 కోట్లుకాగా.. రూ. 12,188 కోట్ల నికర లాభం ఆర్జించింది. అయితే ఈ ఏడాది తొలి క్వార్టర్(ఏప్రిల్--జూన్)లో నికర లాభం 7 శాతం పుంజుకుని రూ. 3,120 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 9 శాతం ఎగసి రూ. 5,252 కోట్లకు చేరింది.

**ఈ షేర్లకు పండుగ**

ఎన్ఎస్ఈ లిస్టకానుండటంతో ఐఎఫ్‌సీఐ, న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీ కౌంటర్లకు డిమాండ్ కొనసాగుతోంది. దీంతో తాజాగా ఐఎఫ్‌సీఐ షేరు 6 శాతం జంప్‌చేసి రూ. 101ను దాటింది. తొలుత రూ. 107కు ఎగసింది. ఇక న్యూ ఇండియా 17.5 శాతం దూసుకెళ్లి రూ. 230కు చేరింది. ఇవి 52 వారాల గరిష్ట ధరలుకాగా.. స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్‌లో 52.86 శాతం వాటా కలిగిన ఐఎఫ్‌సీఐ ఎన్ఎస్ఈ లిస్టింగ్‌తో లబ్ధి పొందనుంది. స్టాక్ హోల్డింగ్‌కు ఎన్ఎస్ఈలో 4.44% వాటా ఉంది. ఈ బాటలో ఎన్ఎస్ఈలో 1.42% వాటా కలిగిన న్యూ ఇండియా సైతం వాటా విక్రయం ద్వారా లాభపడనుంది. గత నెల రోజుల్లో ఐఎఫ్‌సీఐ 42%, న్యూ ఇండియా 33% చొప్పున బలపడటం గమనార్హం!

ఈఎస్‌డీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్, ప్రయారిటీ జ్యువెల్స్ షేర్లు లిస్టింగ్ రోజే అప్పర్ సర్క్యూట్‌ను తాకి, అక్కడే లాక్ అయ్యాయి. ఇష్యూ ధరతో పోలిస్తే తొలి రోజే ఈఎస్‌డీఎస్ షేరు 109%, ప్రయారిటీ జ్యువెల్స్ షేరు 18 శాతం లాభాలు ఇన్వెస్టర్లకు పంచాయి.

# ఒకే కంపెనీలో లక్ష ఉద్యోగాల కోత!



జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ వోక్స్‌వ్యాగన్ భారీ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమైంది. దశాబ్దం చివరి నాటికి మొత్తం 1 లక్ష ఉద్యోగాలను తగ్గించేందుకు కంపెనీ యాజమాన్యం, కార్మిక సంఘాలు అంగీకరించాయి. ఇప్పటికే అంగీకరించిన 50 వేల ఉద్యోగాల కోతకు అదనంగా మరో 50 వేల పోస్టులను తగ్గించేందుకు తాజాగా ప్రణాళిక రూపొందించారు. ప్రపంచ ఆటోమొబైల్ పరిశ్రమలో ఇప్పటివరకు చేపట్టిన అతిపెద్ద పునర్వ్యవస్థీకరణల్లో ఇది ఒకటిగా నిలవనుంది. వోక్స్‌వ్యాగన్ గ్రూప్‌లో ఆడి, పోర్షే సహా 10 బ్రాండ్లు ఉన్నాయి. సంస్థ ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్యను సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉందని కంపెనీ పేర్కొంది. అమెరికా సుంకాలు, ఎలక్ట్రిక్ వాహనాలకు మందగించిన డిమాండ్, ముఖ్యంగా చైనాలో స్థానిక కార్ల తయారీ సంస్థల నుంచి పెరుగుతున్న పోటీ వోక్స్‌వ్యాగన్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

**15 శాతం ఉద్యోగాలకు కోత**

ప్రతిపాదిత 1 లక్ష ఉద్యోగాల కోత ప్రపంచవ్యాప్తంగా వోక్స్‌వ్యాగన్ గ్రూప్ ఉద్యోగుల్లో దాదాపు 15 శాతానికి సమానం. 2009లో దివాలా రక్షణ కోసం దరఖాస్తు చేసిన జనరల్ మోటార్స్ చేపట్టిన 50 వేల ఉద్యోగాల కోతను కూడా ఇది అధిగమిస్తుంది.

**నాలుగు ప్లాంట్ల భవిష్యత్తుపై అనిశ్చితి**

హన్నోవర్, ఎమ్డెన్, జ్వికావు, నెకార్సుల్మ్‌లోని నాలుగు జర్మన్ ప్లాంట్ల దీర్ఘకాలిక భవిష్యత్తుకు హామీ ఇవ్వలేమని యాజమాన్యం, కార్మిక సంఘాలు అంగీకరించాయి. వీటిలో ఏదైనా ప్లాంట్‌ను మూసివేస్తే, జర్మనీలో పూర్తి స్థాయి కర్మాగారాన్ని వోక్స్‌వ్యాగన్ తొలిసారిగా మూసివేసినట్లవుతుంది. ముఖ్యంగా జ్వికావు ప్లాంట్ మూసివేతపై అక్కడి ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఆ ప్లాంట్‌పై ఆధారపడే సరఫరాదారులు, ఇతర స్థానిక ఉద్యోగాలు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉండటంతో మొత్తం ప్రాంత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ఉంటుందని కార్మికులు చెబుతున్నారు.

**పర్యవేక్షక బోర్డు ఆమోదం**

కంపెనీ పర్యవేక్షక బోర్డు కొత్త పునర్వ్యవస్థీకరణ ప్రణాళికకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇది వోక్స్‌వ్యాగన్ భవిష్యత్తుకు బలమైన సంకేతమని సీఈవో ఆలివర్ బ్లూమ్ పేర్కొన్నారు. అయితే ఉద్యోగుల కోతలపై యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య చర్చలు తీవ్రంగా సాగాయి. ముఖ్యంగా 1 లక్ష ఉద్యోగాల కోతకు సంబంధించిన సమాచారం ముందుగానే మీడియాలో వెలువడటంపై కార్మిక సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి.

**ప్లాంట్ల మూసివేతపై యూనియన్ స్పష్టత**

వోక్స్‌వ్యాగన్ పర్యవేక్షక బోర్డులో కార్మిక ప్రతినిధులకు గణనీయమైన ప్రాతినిధ్యం ఉంది. ప్లాంట్ల ఏర్పాటుకు లేదా పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన కీలక నిర్ణయాలపై వారికి ప్రత్యేక అధికారాలు ఉన్నాయి. తాజాగా ఈ అధికారాల పరిధిని మార్చే అంశంపైనా చర్చ జరిగింది. అయితే ఐజీ మెటల్ యూనియన్, వోక్స్‌వ్యాగన్ పర్యవేక్షక బోర్డు సభ్యులు మాత్రం ఏ ప్లాంట్‌నూ వదులుకోలేదని, ప్లాంట్ మూసివేతకూ ఎలాంటి ఆమోదం ఇవ్వలేదని స్పష్టం చేశారు. జర్మనీలోని లోయర్ సాక్సోనీ రాష్ట్రంతో కలిసి కార్మిక ప్రతినిధులు రాజీకి వచ్చి, వివాదం మరింత ముదరకుండా అడ్డుకున్నామని వారు తెలిపారు. వోక్స్‌వ్యాగన్ తాజా నిర్ణయం యూరప్ ఆటోమొబైల్ రంగంలో నెలకొన్న సవాళ్లకు అద్దం పడుతోంది. ఎలక్ట్రిక్ వాహనాల మార్పు, చైనా కంపెనీల నుంచి పెరుగుతున్న పోటీ, వాణిజ్య సుంకాల ప్రభావం నేపథ్యంలో ప్రపంచంలోని అతిపెద్ద కార్ల తయారీ సంస్థలు తమ వ్యూహాలను, ఉత్పత్తి సామర్థ్యాలను, ఉద్యోగుల సంఖ్యను పునఃపరిశీలిస్తున్నాయి.

# శుభం కోరుకునే 'కామ్రేడ్ కళ్యాణ్'



"కామ్రేడ్' అంటే స్నేహితుడు. కళ్యాణ్ అంటే శుభం. ఎప్పుడూ పక్కవారి శుభం కోరుకునే స్నేహితుడన్నమాట. ఈ సినిమా ఫస్టాఫ్ అంతా సరదాగా ఉంటుంది. నెమ్మదిగా కథలోకి వెళ్లాక సత్య ఎంటరవుతాడు. అక్కడ్నుంచి చాలా వెరైటీ ఫన్ ఉంటుంది. ఈ సినిమా అందరికీ కచ్చితంగా నచ్చుతుంది' అని హీరో శ్రీవిష్ణు అన్నారు. ఆయన కథానాయకుడిగా రానున్న కామెడీ ఎంటర్‌టైనర్ 'కామ్రేడ్ కళ్యాణ్'. జానకిరామ్ మారెళ్ల దర్శకుడు. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మాతలు. అక్టోబర్ 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. పీపుల్‌స్టార్ ఆర్.నారాయణమూర్తి, అగ్ర రచయిత విజయేంద్రప్రసాద్, దర్శకులు బాబీ, శివ నిర్వాణ, వీఎన్ ఆదిత్య, నందినీరెడ్డి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రానికి బృందానికి శుభాకాంక్షలు అందించారు.



## డిసెంబర్‌లో లెగసీ

విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'లెగసీ'చిత్రాన్ని డిసెంబర్ 4న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. సాయికిరణ్ రెడ్డి దైదా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కలాహి మీడియా సంస్థ నిర్మిస్తున్నది. ఏక్తా రాథోడ్ కథానాయికగా నటిస్తున్నది. శనివారం రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను ఆవిష్కరించారు. అధికారం, కుటుంబం, ప్రేమ, ద్రోహం వంటి అంశాల నేపథ్యంలో ఇంటెన్స్ పొలిటికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: గోవింద్ వసంత, నిర్మాతలు: యశ్వంత్ దగ్గుమాటి, సాయికిరణ్ రెడ్డి దైదా.



## 'ఇరుముడి' నుంచి 'కార్తీకమాసం' వీడియో సాంగ్ విడుదల!

మాస్ మహారాజా రవితేజ హీరోగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి' నుంచి మరో క్రేజీ పాట విడుదలైంది. ఇప్పటికే "మల్లెపూల పల్లకి" వీడియో సాంగ్‌ను విడుదల చేసిన మేకర్స్ తాజాగా మరో పాటను వదిలారు. అయ్యప్ప స్వామి భక్తి దీక్ష విశిష్టతను, ఆధ్యాత్మిక పరివర్తనను అత్యంత హృద్యంగా ఆవిష్కరిస్తూ రూపొందించిన 'కార్తీకమాసం..' అంటూ సాగే పూర్తి వీడియో గీతాన్ని చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ఆధ్యాత్మిక ప్రియులను, ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో రవితేజ పాత్రలో వచ్చే భావోద్వేగాలు, జీవితంలో అలవాటైన చెడు వ్యసనాలను పూర్తిగా మానుకొని, కఠినమైన అయ్యప్ప దీక్షను భక్తిశ్రద్ధలతో ఎలా కొనసాగించారనే పట్టుదలను ఈ పాటలో దర్శకుడు చాలా చక్కగా చూపించారు. ఒక వ్యక్తి తన అంతరాత్మతో పోరాడుతూ ఆధ్యాత్మిక మార్గం వైపు అడుగులు వేసే ప్రయాణానికి ఈ పాట అద్దం పడుతోంది. సినిమాలోని కథాబలానికి ఈ గీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుందని తాజా వీడియో చూస్తే స్పష్టమవుతోంది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్ అందించిన బాణీలు ఈ పాటకు ప్రాణం పోశాయి. హృదయానికి హత్తుకునేలా ఉన్న ట్యూన్స్‌తో పాటు, ఈ పాటకు స్వయంగా దర్శకుడు శివ నిర్వాణ అందించిన సాహిత్యం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తి భావాలతో పాటు జీవిత సత్యాలను ప్రతిబింబించేలా ఉన్న ఈ పదాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. రవితేజ నటన, జీవీ ప్రకాష్ సంగీతం, శివ నిర్వాణ సాహిత్యం-దర్శకత్వం అన్నీ కలిసి ఈ పాన్ని ఒక మ్యూజికల్ మాస్టర్‌పీస్‌గా మలిచాయి.

## ఆ పాత్ర తెగ నచ్చేసింది!

'భరత్ అనే నేను' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ. ఆ సినిమా హిట్ కొట్టడంతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్‌ను సొంతం చేసుకున్నది. ఆ తరువాత 'వినయ విధేయ రామ' అట్టర్‌ఫ్లాప్‌గా నిలిచినా కియారా క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. హిందీలో బిజీగా మారిపోయిన ఈ బ్యూటీ కేజీఎఫ్ ఫేమ్ యశ్‌తో కలిసి 'టాక్సిక్'లో జతకట్టింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి అడుగుపెట్టి సందడి చేస్తున్న సందర్భంగా కియారా పంచుకున్న కార్‌వాన్ కబుర్లివి...కొత్త సినిమాలు చూడండి మా కూతురికి మేము ఎలాంటి రూల్స్ పెట్టదలుచుకోలేదు. తను జీవితాన్ని పూర్తిగా అనుభవించాలి. పొరపాట్లు మానవ సహజం. వాటినుంచే నేర్చుకుంటారు కూడా. నా విషయంలోనూ అదే జరిగింది. చివరకు సిద్ధార్థ్ రూపంలో సరైన వ్యక్తి దొరికాడు. టాక్సిక్ షూటింగ్ జరుగుతున్న సమయంలో నేను గర్భవతిని. ఆ విషయం తెలిశాక మూవీ టీం మొత్తం నన్ను ఎంతో బాగా చూసుకున్నారు. హీరో యశ్ ఎంతో జాగ్రత్తగా చూసుకుంటూ సెట్‌లో నాకొక బాడీగార్డ్, బౌన్సర్‌లా మారిపోయాడు. వాళ్లందరి సహకారంతోనే నా పాత్రకు న్యాయం చేశాను. నేను 'ఎంఎస్ ధోనీ' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యానని చాలామంది భావిస్తారు. కానీ, నా మొదటి సినిమా 'ఫుగ్లీ' బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని చవిచూసింది. దాంతో నా కెరీర్‌లో పెద్ద గ్యాప్ వచ్చింది. ఆ సమయంలో కొత్త అవకాశాల కోసం మళ్లీ మొదటినుంచి ఆడిషన్లు ఇవ్వడం మొదలు పెట్టాను. అందులో చాలా వరకు రిజెక్ట్ అయ్యాయి కూడా. అయినా కుంగిపోకుండా పట్టుదలతో ముందుకు సాగాను.




## గన్స్‌కి గట్స్ ఉండాలి!

అగ్ర హీరో బాలకృష్ణ నటిస్తున్న 111వ చిత్రానికి 'దాదా' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 24న ప్రేక్షకుల ముందుకురానుంది. శనివారం టైటిల్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ మాస్ అవతారంలో గ్యాంగ్‌స్టర్ వైబ్‌తో కనిపిస్తున్నారు. 'నాకు గురిపెట్టడానికి ఒంట్లో పొగరు, వేలికి ట్రిగ్గర్ ఉంటే సరిపోదు. బుల్లెట్స్‌కి బలుపు, గన్స్‌కి గట్స్ ఉండాలి' అంటూ బాలకృష్ణ చెప్పిన సంభాషణ ఆకట్టుకునేలా ఉంది. మంచు మనోజ్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, రచన-దర్శకత్వం: గోపీచంద్ మలినేని.



## మారెమ్మ అందరికీ నచ్చుతుంది.

'ఈ సినిమా రఫ్ కట్ చూశా. వెరీ రూటెడ్ అండ్ రస్టిక్‌గా చాలా బావుంది. నాకు భలే నచ్చింది. తప్పకుండా ఆడియన్స్‌కి కూడా నచ్చుతుంది. మాధవ్ బాగా చేశాడు. ప్రశాంత్ విహారి పాటలు, డీవోపీ వర్క్ బావుంది. డైరెక్టర్ నాగరాజు చాలా బాగా తీశాడు. ఈ సినిమాకు మంచి పేరు, డబ్బులు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని అగ్ర కథానాయకుడు రవితేజ అన్నారు. ఆయన సోదరుడు రఘు తనయుడైన మాధవ్ హీరోగా పరిచయం అవుతున్న తెలంగాణ రూరల్ డ్రామా 'మారెమ్మ'. దీపా బాలు కథానాయిక. మంచాల నాగరాజ్ దర్శకుడు. మయూర్‌రెడ్డి బండారు నిర్మాత. ఈ నెల 10న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కి అతిథిగా విచ్చేసిన రవితేజ పై విధంగా స్పందించారు. హీరో మాధవ్ మాట్లాడుతూ 'ఒక మనిషికి, దున్నపోతుకీ మధ్య ఉన్న అనుబంధాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన సినిమా ఇది. ఈ ఎమోషన్‌ని మహిషాపురం మారెమ్మతల్లితో బ్లెండ్ చేసి సినిమాను జనరంజకంగా తీశారు దర్శకుడు మంచాల నాగరాజు. పనిచేసినవారంతా ప్రాణం పెట్టారు. తప్పకుండా సినిమా అందరికీ నచ్చుతుంది' అని తెలిపారు. ఇంకా దర్శకుడు మంచాల నాగరాజు, కథానాయిక దీపాబాలు, వికాస్ వశిష్ట, తదితర చిత్రబృందంతోపాటు డైరెక్టర్ హసిత్ గోలీ, కుశాల్‌రెడ్డి కూడా మాట్లాడారు.



## తెల్ల కాగితం ఓ స్వచ్ఛమైన ప్రేమకథ



'కోర్ట్'ఫేం హర్ష్ రోషన్ హీరోగా రూపొందుతున్న యువతరం ప్రేమకథ 'తెల్ల కాగితం'. నక్షత్ర కథానాయిక. రమేశ్ బండ్రెడ్డి దర్శకుడు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మాత. అక్టోబర్ 2న సినిమా విడుదల కానున్నది. శనివారం టీజర్ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు బాబీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు.వీశీఙఅవం హీరో హర్ష్ రోషన్ మాట్లాడుతూ 'ఇది మనందరి కథ. పదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివిన ప్రతి ఒక్కరూ కనెక్టయ్యే కథ. 'తెల్లకాయితం' అనేది ఒక స్వచ్ఛమైన ఇన్నోసెంట్ లవ్‌స్టోరీ. తప్పకుండా అందరికి నచ్చుతుంది' అన్నారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com